కామాంధుడి కథ ముగిసింది



నారాయణరావు మృతదేహం

- తునిలో బాలికపై అత్యాచారం చేసిన నిందితుడి మృతి
- పోలీసుల నుంచి తప్పించుకుని చెరువులో దూకిన నిందితుడు
- న్యాయాధికారి వద్దకు తరలిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఘటన
- రాత్రి చెరువులో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించినా దొరకని ఆచూకీ
- గురువారం ఉదయం చెరువు మధ్యలో వలకు చిక్కిన మృతదేహం

(కాకినాడ/తునిరూరల్, ఆంధ్రజ్యోతి)

బాలికను చెరచిన కామాంధుడి కథ ముగిసింది.. తాతయ్యనంటూ బాలికపై పలుసార్లు అత్యాచారం చేసి అరెస్టయిన నిందితుడి కథ కంచికి చేరింది. చేసిన పాపానికి కటకటాల్లో శిక్ష అనుభవించాలన్న భయమో.. లేదంటే సభ్య సమాజానికి తన నిజరూపం బయట తెలిసిపోయిందన్న అవమానమో చివరకు నిందితుడు నారాయణరావు పోలీసులనుంచి తప్పించుకుని ప్రాణాలు కోల్పోయాడు. చెరువులోకి దూకి పాపం పండించుకున్నాడు. చివరికి ఈ కామాంధుడి మరణం సొంత రక్తసంబధీకులను సైతం కంటతడి పెట్టించలేదు. కనిపెంచిన తండ్రి పాపాలపుట్ట బద్ధలై పైకి పోవడమే మంచిదయిందంటూ ఆగ్రహంగా పేర్కొనడం నిందితుడిపట్ల కుటుంబంలోను ఏస్థాయిలో ఏవగింపు కలిగించిందో చాటుతోంది. బాలికను చెరచిన ఇలాంటి వ్యక్తి చనిపోవడమే మంచిదంటూ ఆగ్రహం వ్యక్తం చేసేలా వారంతా వ్యాఖ్యానించడం నారాయణరావు చేసిన తప్పు ఎలాంటిదనేది చాటుతోంది. సదరు నిందితుడి మృతదేహాన్ని తీసుకోవడానికి కుటుంబీకులు సైతం ముందుకురాకపోవడం విశేషం. తొండంగి తోటలో బాలికను అత్యాచారం చేసిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టుచేయడంతోపాటు పలు తప్పుడు పోస్టులు షేర్ చేయడంపై వైసీపీ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అనుచరుడు గణేశుల వీరబాబును పోలీసులు అరెస్ట్ చేశారు.

(మిగతా 7వ పేజీలో)

వానే.. వాన!



- అల్పపీడనంతో జిల్లాలో వర్షాలు
- నేడు వాయుగుండంగా మారొచ్చు
- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని అధికారుల హెచ్చరిక
- అత్యధికంగా కాట్రేనికోనలో 111.2 మిల్లీమీటర్లు..
- అత్యల్పంగా మండపేటలో 9.6 మిల్లీమీటర్ల వర్షం

వానే వాన.. జిల్లాలో గురువారం వర్షం జోరున కురిసింది. ఈ ధాటికి రహదారులు జలమయమయ్యాయి. పంట చేలు నీట మునిగాయి.

అమలాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా గురువారం భారీ వర్షాలు కురిశాయి. ప్రధానమైన డ్రెయిన్లు, పంటకాల్వలు పొంగి ప్రవహించడంతో శివారు ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. జిల్లాలోని అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలతోపాటు ముమ్మిడివరం నగర పంచాయతీల పరిధిలో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమై ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

జిల్లాలో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు 1410.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ భారీ వర్షాల వల్ల అమలాపురం పట్టణంలోని పల్లపు ప్రాంతాలతోపాటు ఎర్రవంతెన వద్ద ఉన్న హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షపునీరు నిలిచిపోయి లోతట్టుగా ఉన్న ఇళ్లల్లోకి కూడా ప్రవేశించింది. గండువీధిలో నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్సు నుంచి ఈదరపల్లి వెళ్లే రహదారి జలదిగ్బంధానికి గురైంది.

పంటచేల మునక

భారీవర్షాలవల్ల జిల్లాలో పంటచేలు ముంపునకు గురయ్యాయి. అకాలవర్షాలకు పంటలపై తెగులు సోకే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముంపునీరు దిగేందుకు నడుం బిగించి చేల మధ్యలో బరులు చేసుకుని సమీపంలోని బోదెల్లోకి, పల్లపు ప్రాంతాలకు నీటిని తరలించే పనిలో వారు నిమగ్నమయ్యారు.మండపేటలో మున్సిపల్అధికారులు కంట్రోల్ రూము ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో వర్షాలపై సమీక్షిస్తున్నారు. వర్షాలవల్ల మధ్యాహ్నం నుంచి కొన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించి పిల్లలను పంపించేశారు. పలుచోట్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. అప్‌అండ్‌డౌన్ రావడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.



కపిలేశ్వరపురం మండలం దేకిలో వాన ధాటికి నేలనంటిన వరిచేను



అమలాపురంలో కలెక్టరేట్ వద్ద కురుస్తున్న వర్షం

మరో నాలుగైదురోజులు వర్షాలు

అల్పపీడనం శుక్రవారం మధ్యాహ్నం నాటికి ఉత్తర తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు ఆనుకుని నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఆ తర్వాత అది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ రాగల 24 గంటల్లో బలపడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లాలో మరో నాలుగైదు రోజులపాటు భారీవర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉంటుందని అమరావతి వాతావరణ శాఖ వెల్లడించింది. తీర ప్రాంతం అల్లకల్లోలంగా మారింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. గంటకు గరిష్ఠంగా 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండడంతో తీర ప్రాంతాల్లో అలజడి నెలకొంది.ఈనెల 25వరకు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో అనేక ప్రాంతాలపై వర్ష ప్రభావం ఉండనుంది. సముద్రం అల్లకల్లోంగా మారడంతో చేపల వేటకు మత్స్యకారులు వెళ్లకుండా అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసి వారిని అప్రమత్తం చేశారు.



కె.గంగవరంలో కురుస్తున్న భారీ వర్షం

జిల్లాలో నమోదైన వర్షపాతం

గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లావ్యాప్తంగా కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలో మొత్తం వర్షపాతం 1410.8 మిల్లీమీటర్లు కాగా అత్యధికంగా కాట్రేనికోన మండలంలో 112.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా మండపేట 9.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురం మండలంలో 44.6, రాయవరంలో 20.4, రామచంద్రపురంలో 18, ఆలమూరు 62.6, రావులపాలెం 77, కొత్తపేట 97.8, కపిలేశ్వరపురం 74.4, కె.గంగవరం 79.2, ఐ.పోలవరం 92.4, ముమ్మిడివరం 84 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అయినవిల్లి మండలంలో 91, అంబాజీపేట 51, పి.గన్నవరం 50, మామిడికుదురు 37.2, రాజోలు 44.4, మలికిపురం 79.2, సఖినేటిపల్లి 62.2, అల్లవరం 40, అమలాపురం 74.6, ఉప్పలగుప్తంలో 110 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రకటించింది.



ముమ్మిడివరంలో సబ్ ట్రెజరీ కార్యాలయంలోకి ప్రవేశించిన వర్షపునీరు

ఇంటి నుంచే పని.. చేసేయొచ్చు!



నిరుద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోం కింద ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. నిరుద్యోగుల ఆశలను చిగురింపచేస్తూ వర్క్ ఫ్రమ్ హోం కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు త్వరలోనే ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఐటీ కంపెనీలు ఒక్కొక్కటిగా రాష్ట్రానికి తరలివస్తున్నాయి. ఈ తరుణంలో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసుకున్న వేలాదిమంది నిరుద్యోగులు చిరుద్యోగిగానైనా ఆయా మల్టీ నేషనల్ కంపెనీల్లో అవకాశం కల్పిస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- నిరుద్యోగులకు వర్క్‌ఫ్రమ్ హోంకు ఏర్పాట్లు
- త్వరలోనే ఆన్‌లైన్ పరీక్షలకు సన్నాహం
- సచివాలయాలకు వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లు పంపిణీ

అమలాపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా వేలసంఖ్యలో అభ్యర్థులు కౌశలం సర్వేలో దరఖాస్తు చేసుకున్నారు. నిరుద్యోగులకు సచివాలయాల వారీగా పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రం నుంచి పరీక్షల నిర్వహణలో భాగంగా సచివాలయాలకు వెబ్ కెమెరాలు, హెడ్‌సెట్‌లను పంపిణీ చేశారు. త్వరలోనే పరీక్షల నిర్వహణకు సంబంధించిన సమాచారం విడుదలయ్యే అవకాశం ఉంది. వర్క్‌ఫ్రమ్ హోం కింద కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఏర్పాట్లు చేస్తుండడం పట్ల వారంతా ఆశగా ఎదురు చూస్తున్నారు.

రెండు విడతలుగా సర్వే

వర్క్‌ఫ్రమ్ హోం సర్వేలో భాగంగా తొలి విడత గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఇంటింటా సర్వే నిర్వహించారు. విద్యార్హతలను బట్టి వర్క్ ఫ్రమ్ హోం కింద ఏ తరహా ఉద్యోగాలు చేయాలనుకుంటున్నారో నమోదు చేశారు. పదో తరగతి నుంచి డిగ్రీ, పీజీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్‌తోపాటు వివిధ విద్యార్హతలు ఉన్న అభ్యర్థుల సమాచారాన్ని సమగ్రంగా తొలివిడతలో సేకరించారు. తొలి విడతలో నిర్వహించిన వర్క్‌ఫ్రమ్ హోం సర్వే కింద ఉద్యోగాలు చేసేందుకు జిల్లాలో కొందరు నిరుద్యోగులు ఆమోదం తెలిపారు. వారి సమగ్ర సమాచారాన్ని ఈ ఏడాది ఆగస్టు నెలలో రెండోదశలో సేకరించారు. ఎవరెవరు ఏం చదువుకున్నారో తెలుసుకుని వారి సర్టిఫికెట్లను సైతం ఆన్‌లైన్ చేశారు. నిరుద్యోగ అభ్యర్థులకు తెలిసిన భాషలు ఎన్ని, విద్యార్హతలు, ఏమైనా స్పెషలైజేషన్ కోర్సు పూర్తి చేశారా, వచ్చిన మార్కులు, ఏ ఏడాదిలో ఉత్తీర్ణులయ్యారో తెలుసుకుని వివరాలు అన్నింటినీ సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ చేశారు.

సచివాలయశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు

కౌశలం సర్వేలో వర్క్‌ఫ్రమ్ హోం కింద దరఖాస్తు చేసుకున్న వారికి జిల్లా గ్రామ, వార్డు సచివాలయశాఖ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే పరీక్షల నిర్వహణ వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. ప్రభుత్వం పలు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని వారి సహకారంతో ఈ పరీక్షలు నిర్వహించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా ఐటీ సెక్టార్‌పై దృష్టి సారించినట్టు తెలిసింది. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు వర్క్‌ఫ్రమ్‌హోం కింద ఉద్యోగావకాశాలు మెండుగా కల్పించే అవకాశం ఉందంటున్నారు. దీనిలోభాగంగానే ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్నవారి ఇళ్ల వద్ద బ్రాడ్‌బ్యాండ్ కనెక్టవిటీ ఉందా, దాని స్పీడ్ వివరాలు, వర్క్ ఫ్రమ్ హోం ఉద్యోగం చేసుకోవడానికి ఇంట్లో ప్రత్యేక గది ఉందా, అదే గదిలో మరికొందరు పనిచేసుకునే అవకాశం ఉదా అన్న వివరాలను సైతం ఇప్పటికే సేకరించారు.

ఏ జిల్లాలో ఎందరు..

తొలి, రెండో దశల్లో మొత్తం సర్వే చేసిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 4,23,533 గృహాల్లో 9,34,989మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 920791 మందిని సర్వేచేయగా 1,93,564మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 14,865మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.
- కాకినాడ జిల్లాలో 5,35,791 గృహాల్లో 11,79,587మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 11,58,593మందిని సర్వే చేయగా 2,15,845మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 19,628మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.
- తూర్పుగోదావరి జిల్లాలో గృహాల్లో 463680మంది చదువుకున్నవారు ఉన్నారు. వీరిలో 10,19,051మందిని సర్వే చేయగా 10,01,395మంది ఉద్యోగాల్లో ఉన్నారు. వీరిలో 18,844మంది వర్క్‌ఫ్రం హోంలో పనిచేస్తున్నట్టుగా గుర్తించారు.

తీరంలో అలజడి.. ఎగసిపడుతున్న అలలు



అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో ఎగసిపడుతున్న సముద్ర అలలు

అల్లవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండ ప్రభావంవల్ల సముద్ర తీరం అలల ఉధృతితో అల్లకల్లోలంగా మారింది. భారీఈదురుగాలులు వీస్తూ ఉవ్వెత్తున అలలు ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి భూమి కోతకు గురైంది. భారీ అలలు ఇసుక తిన్నెలపైకి చొచ్చుకు వస్తున్నాయి. అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం, రామేశ్వరం తీర ప్రాంతాల్లో అలల ఉధృతితో తీరం అల్లకల్లోలంగా తయారైంది.

శిక్షణ ద్వారా నాణ్యమైన సేవలందించాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్
- వీహెచ్‌ఏలకు పాడి పశువులపై శిక్షణ ప్రారంభం



పశుసంవర్ధకశాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సచివాలయ పశు సంవర్ధకశాఖ సహాయకులు పాడి పశువులపై శిక్షణల ద్వారా అవగాహన పెంచుకుని నాణ్యమైన సేవలను అందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన పశు సంవర్ధకశాఖ అధికారులతో జరిగిన సమావేశంలో అన్నారు. ఈ నెల 23 నుంచి రెండు రోజుల పాటు జరిగే పశు సంవర్ధకశాఖ సచివాలయ సహాయకులు (వీహెచ్‌ఏ) శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా నైపుణ్యాలను అలవరచుకుని జిల్లాలో పాడి పరిశ్రమ అభివృద్ధిలో కీలకంగా మారి సేవలు అందించాలని సూచించారు. పశువుల పెంపకందారులకు నాణ్యమైన సేవలు అందించడానికి కృషి చేయాలని కోరారు. గ్రామస్థాయిలో పశు ఆరోగ్య సంరక్షణ, రోగ నియంత్రణ, పాడి పశు సంవర్ధక ఉత్పత్తి విస్తరణలో ఉద్యోగుల పాత్రను బలపరుస్తుందన్నారు. రైతు కూలీలు, మహిళా సంఘాలకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం పశు సంవర్ధకశాఖ సహాయకులు గ్రామ సచివాలయ స్థాయిలో పశురోగ నివారణ, మేత పంటల ప్రోత్సాహం, పశు సంక్షేమ పథకాల అమలులో సమర్థవంతంగా సేవలు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. శిక్షణ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎస్.వెంకట్రావు, అధికారులు కర్నీడి మూర్తి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఖేల్‌రత్న అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రుద్ర

అమలాపురంటౌన్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మేజర్ ధ్యానచంద్ పేరిట అందించే ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వీఆర్.రుద్ర కోరారు. రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సహాన్ పురస్కారాలకు సంబంధించి అర్హులైన క్రీడాకారులనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. అర్హులైనవారు ఈనెల 28వతేదీ రాత్రి 11.59గంటల వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు.

పాల దిగుబడిని పెంచేందుకు చర్యలు చేపట్టాలి: కలెక్టర్

అమలాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువుల సంతతి, పాడి పశువుల ఉత్తమ పోషణ ద్వారా పాల దిగుబడిని పెంచేందుకు వినూత్న సంస్కరణలు తీసుకువస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. జిల్లాలో ఉన్న పాడి రైతులు, వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, పశుగ్రాస దాణా ఉత్పత్తిదారులు, పశు సంవర్ధకశాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనీయంగా తగ్గిపోతున్న పశువుల సంతతిని మెరుగుపరచడం, గర్భధారణకు చూడి పశువుల గర్భం నిలిచేలా, పాల దిగుబడి పెంచేలా టోటల్ మిక్సర్ దాణాను తక్కువ ధరకు విక్రయించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పశుగ్రాస అభివృద్ధికి రాయితీపై విత్తనాలు అందిస్తామన్నారు. పోషక విలువలు కలిగిన సంపూర్ణ దాణా 50కిలోల కిట్లను రాయితీపై సరఫరా చేసేందుకు ప్రముఖ దాణా సంస్థలతో పోషక విలువలు కలిగిన పాల దిగుబడిని పెంచేలా సరఫరా చేయడానికి సంప్రదింపులు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. సమీక్షలో పశు సంవర్ధకశాఖ అధికారి వెంకట్రావు, ఏడీ ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వాడపల్లి ఏటిగట్టు రోడ్డుకు రూ.6కోట్ల నిధులు

- కొత్తపేట ఎమ్మెల్యే బండారు వినతి
- మంజూరు చేసిన డిప్యూటీ సీఎం పవన్

7



మంగళగిరిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో పవన్‌కల్యాణ్‌ను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

- ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ సూర్యప్రకాష్



ఈదరపల్లిలో సబ్‌స్టేషన్ కొత్త లైన్లను ప్రారంభిస్తున్న సూర్యప్రకాష్

అమలాపురం రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ టీజీ సూర్యప్రకాష్(విశాఖపట్నం) జిల్లా యంత్రాంగానికి సూచించారు. గురువారం ఈదరపల్లిలోని విద్యుత్ కేంద్ర కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈదరపల్లిలో 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన రెండు 11కేవీ ఫీడర్లతోపాటు ఇతర విభాగాలను ఆయన ప్రారంభించారు. రాజోలు సబ్‌స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 11కేవీ ఫీడర్‌ను ప్రారంభించారు. విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అమలాపురం ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తదితరులు ఆయన వెంట ఉన్నారు.

క్రీడోత్సవంలో విద్యార్థులు అధికంగా పాల్గొనాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్ విజ్ఞప్తి


అమలాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల క్రీడా పోటీల నిర్వహణకు ప్రణాళిక, సమయ పాలనతోపాటు విద్యార్థులు అధికంగా పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం రెండో దఫా కోనసీమ క్రీడోత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. క్రీడా కమిటీలను వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థి ప్రతినిధులను కలిపి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. మూడురోజుల క్రీడా పోటీల ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బడ్జెట్ ప్రణాళికలో క్రీడా పరికరాలు, బహుమతులు, నీటి సదుపాయం, ప్రథమ చికిత్స మొదలైన వాటి ఖర్చుల అంచనాలు రూపొందించాలని సూచించారు. తరగతుల వారీగా జట్లను, వ్యక్తిగత ఆటగాళ్లను ఎంపిక చేయాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక క్రీడలోనైనా పాల్గొనేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. సమాచారం అందరికీ తెలిసేలా నోటీసు బోర్డుల్లోను ప్రదర్శించాలని ఆదేశించారు. ముగింపు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావాలని సూచించారు. వివిధ క్రీడా పోటీలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. శాంతియుత వాతావరణంలో క్రీడాపోటీలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఈవో సలీంబాషా, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, స్కూల్‌గేమ్ కార్యదర్శులు ఈశ్వరరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సువర్ణోదయం..!

తెలతెలవారుతుండగా ఆకాశం సువర్ణమయంగా మారి కనువిందు చేసింది. మేలిమి ఛాయలో ఆకాశం మధ్యమధ్యలో నల్లని మబ్బులతో ఈ ఈ అద్భుత దృశ్యాన్ని చూసిన వారు ఆశ్చర్యానికి గురయ్యారు. అల్లూరి సీతా రామరాజు జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో గురువారం ఈ దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది.

- ఎటపాక (ఆంధ్రజ్యోతి)



మేఘాల పరదా!

మేఘాల పరదా పంటపొలాలపై దుప్పటిలా పరచుకున్నట్టుంది కదూ..! దట్టంగా అలముకున్న నల్లని మేఘా లు ఆకాశం నుంచి వరిచేనుపైకి దిగుతున్నట్టున్నాయి.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని పంట పొలాల మీదుగా గురువారం కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి)

క్లాస్ రూం టు అసెంబ్లీ

మాక్ అసెంబ్లీ నిర్వహణ ద్వారా శాసనసభలో అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని విద్యార్థులకు కూటమి ప్రభుత్వం కల్పిస్తోంది. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహిస్తోంది. సర్కారు అందిస్తున్న ఈ లక్కీ చాన్స్‌ను వినియోగించుకునేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.



- అసలు వదల'మాక్'ండి
- అసెంబ్లీ సమావేశాలు ప్రత్యక్షంగా చూసేందుకు విద్యార్థులకు అరుదైన అవకాశం
- పాఠశాల, మండల, నియోజకవర్గ స్థాయిల్లో పోటీల నిర్వహణ



తుని మండలం తేటగుంట జడ్పీ హైస్కూల్లో వక్తృత్వ పోటీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

చట్టసభలంటేనే మన తలరాతను మార్చే గొప్ప ప్రదేశం. అదే అసెంబ్లీ.. అక్కడ జరిగే చర్చలు, తీర్మానాలు.. చట్టాలు చేయడం వంటివి ప్రత్యక్షంగా అక్కడే ఉండి చూడాలని చాలామందికి ఉంటుంది. స్పీకర్ అధ్యక్షతన జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఏయే అంశాలపై చర్చిస్తున్నారు? ఏ విషయాలకు సభ్యులు ఆమోదం తెలుపుతున్నారు?.. అధికార ప్రతిపక్షాల మధ్య వాగ్వాదాలు.. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలపడం.. వాకౌట్లు, ఒకరిపై ఒకరు విమర్శ లు? వంటి ఎన్నో ఆసక్తికర సంఘటనలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయి. మరీ ముఖ్యంగా మన నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఏం మాట్లాడుతున్నారా? స్థానిక సమస్యలపై గళం వినిపించారా లేదా? ఇలాంటి అనేక విషయాలను ఆసక్తిగా గమనిస్తాం. ఒకప్పుడు అసెంబ్లీ సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలను ఎంతో ఇష్టంగా చూస్తూ చాలా మంది సీనియర్ సిటిజన్లు టీవీలకు అతుక్కుపోయేవారు. ఇప్పుడు అరచేతిలోకి అంతర్జాలం అందుబాటులోకి వచ్చేయడంతో సెల్ ఫోన్లలోనే సమావేశాల తీరును గమనిస్తున్నారు.

అయితే రాష్ట్ర పాలనలో కీలకమైన అసెంబ్లీలోకి అడుగుపెట్టే అరుదైన అవకాశాన్ని విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కల్పిస్తోంది. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతిలో నిర్వహించే మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం విద్యార్థులకు కల్పించేలా ఏర్పాట్లు చేస్తోంది.

ఎవరు అర్హులంటే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1582, కాకినాడ జిల్లాలో 1017, తూర్పు గోదావరి జిల్లాలో 982 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3.25లక్షల మంది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో 8, 9, 10 తరగతులు చదివే వారు సుమారు లక్ష వరకు ఉంటారు. వీరిలో ఆసక్తి, ఉత్సాహవంతులైన విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే మంగళ, బుధవారాల్లో పాఠశాల స్థాయిలో ఈ పరీక్షలు జరిగాయి. ఈ నెల 24, 25 తేదీల్లో మండల స్థాయిలో ఆయా స్కూళ్ల పరిధిలో జరగనున్నాయి. వీటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 29, 30 తేదీల్లో జరిగే పోటీలకు పంపుతారు. అక్కడ ఎంపికైన అభ్యర్థులను శిక్షణకు పంపిస్తారు.

ముందుగానే శిక్షణ

ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచేవారికి మాక్ అసెంబ్లీలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ సిటీ, రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని... ఏడు నియోజకవర్గాల నుంచి ఎంపికైన వారికి అమరావతిలో ముందుగానే శిక్షణ ఇస్తారు. అసెంబ్లీలో మాదిరిగానే సీఎం, డిప్యూటీ సీఎం, స్పీకర్, ఎమ్మెల్యేలుగా విద్యార్థులే వ్యవహరిస్తారు. మాక్ అసెంబ్లీ సాక్షిగా విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుకునే అవకాశం దక్కనుంది. ఈ మొత్తం పోటీలను పర్యవేక్షించే బాధ్యతను పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులకు, మండలస్థాయిలో ఎంఈవోలు, డీవైఈవోలకు. నియోజకవర్గ స్థాయిలో డీఈవో, డీవైఈవోలకు అప్పగించారు.

ఇందులో భాగంగా విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహిస్తున్నారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు పాఠశాల,మండల, నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించనున్నారు. వీటిలో ఎంపికైన వారికి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

ఏయే టాపిక్‌లు అంటే..

స్కూలు స్థాయిలో 'లోకల్ సెల్ఫ్ గవర్నెన్స్‌'పై వ్యాసరచన, 'మై ఫేవరెట్ ఫ్రీడం ఫైటర్' అంశంపై వక్తృత్వం, మండల స్థాయిలో 'సివిల్ రైట్స్ అండ్ సిటిజన్ రెస్పాన్సిబులిటీ' అంశంపై వ్యాసరచన, 'మేకింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ యాక్ట్స్ ఫర్ హ్యూమన్ అంశంపై వక్తృత్వం, 'ద ఇండియన్ ఫ్రీడం ఫైట్' అంశంపై క్విజ్ పోటీలు జరుగుతాయి. నియోజకవర్గ స్థాయిలో 'హిస్టరీ బిహైండ్ మేకింగ్ ఆఫ్ ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ (రాజ్యాంగ రూపకల్పన వెనుక చరిత్ర) అంశంపై వ్యాసరచన, 'మేకింగ్ ఇండియా ద్వారా వికసిత్ ఆంధ్రప్రదేశ్' అంశంపై వక్తృత్వం, భారత రాజ్యాంగంపై క్విజ్ పోటీలు జరగనున్నాయి.

29న క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 29న పురుషులు, మహిళల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్‌టెన్నిస్, స్విమ్మింగ్, ఖోఖో, టేబుల్‌టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, యోగా, రెజ్లింగ్ క్రీడాంశాల్లో 29వ తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఎంపికలు ప్రారంభమవుతాయి. (ఓపెన్) నాన్ యూనిఫాం ప్రభుత్వ ఉద్యోగులై ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, ఇటీవల తీయించుకున్న పాస్‌పోర్టు సైజు ఫొటో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అభ్యర్థులకు ఎటువంటి టీఏ, డీఏ ఇవ్వరు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోగా ఏపీ క్రీడల్లో పాల్గొంటారో స్వయంగా లేదా dsakakinada 2023@gmail.com మెయిల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

నేడు కాకినాడలో 'ఏఐ ఫ్యూజన్' సదస్సు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని వివేకానంద పార్కు సమీపంలో గల గోదావరి కళాక్షేత్రంలో 'ఏఐ ఫ్యూజన్-2025' పేరిట గోదావరి ప్రాంతంలో తొలి కృత్రిమ మేథస్సు సదస్సును శుక్రవారం నిర్వహించనున్నారు. పరిశ్రమల యజమానులు, ఆవిష్కర్తలు, స్టార్టప్స్, పరిశోధకులు ఏఐ రంగంలోని తాజా ధోరణులు, భవిష్యత్ అవకాశాలపై చర్చించనున్నారు. స్టార్టప్స్ విభాగంలో ప్రతిభ కనబరిచిన వారికి ఏఐ ఇనోవేషన్ అవార్డులు ప్రదానం చేసి గౌరవించనున్నారు. 2026 ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి ఏఐ ఫ్యూజన్ సదస్సులో దేశవ్యాప్తంగా 38 ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని నిర్వాహకులు చెప్పారు.





మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడు (పైన) పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయస్వామి (ఎడమ)

నేటి నుంచి పాదగయలో దత్త దీక్షల స్వీకరణ

మహా సంస్థానంలో వచ్చే నెల 28 నుంచి దత్తజయంతి సప్తాహ మహోత్సవాలు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న స్వయంభూ శ్రీపాదశ్రీవల్లభ దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్త జయంతి సందర్భంగా శుక్రవారం దత్త మహామండల దీక్ష ప్రారంభించనున్నారు. భక్తులు సర్వాభీష్టసిద్ధికై దీక్ష చేపట్టవచ్చని ఆలయ వేదపండితులు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకు భక్తులకు మాలధారణ ప్రారంభమవుతుంది. అర్ధ మండల దీక్షకు నవంబరు 12న, సప్తాహ దీక్షకు నవంబరు 26న మాలధారణ జరుగుతాయి. డిసెంబరు 3న ఇరుముడి ధారణ, అదేరోజు సాయంత్రం దత్తస్వాముల నగరోత్సవం, డిసెంబరు 4న దత్త జయంతి సందర్భంగా తెల్లవారుజామున శ్రీదత్త దీక్షా విరమణ, మహా పూర్ణాహుతి, స్వామికి మహాపూజ నిర్వహిస్తారు. విఠలానంద మహారాజ్ ఆశీస్సులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దత్తసాయి సేవా సమితి అధ్యక్షుడు వాడ్రేవు శ్రీనివాసరావు గురుస్వామి మాలధారణ చేస్తారు. దత్త దీక్షల స్వీకరణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో నవంబరు 28 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకు దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు ఉత్తరాది, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీ, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభించారు. దత్త జయంతి సప్తాహ మహోత్సవాల్లో ప్రతిరోజూ మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్విక్కులచే మూలమంత్ర అనుష్ఠానం, గణపతి అథర్వ శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాదశ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం నాలుగు గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్త మంత్ర హోమం, ఐదు గంటలకు శ్రీపాదశ్రీవల్లభుల దివ్యపాద పద్మములకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకీ సేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుగుతాయి. నవంబరు 28న దత్తాత్రేయస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అదేరోజు సర్వపుష్పపూజ, 29న లక్ష బిల్వార్చన, 30న సహస్ర చామంతి పూజ, డిసెంబరు 1న లక్ష తులసి అర్చన, 2న సహస్ర లిల్లీ పుష్ప పూజ, 3న గులాబీ అర్చన, సంపెంగ పుష్ప పూజ, 4న పూలంగి సేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో ఆర్.సౌజన్య చెప్పారు.



వెండి నాగాభరణం అందజేస్తున్న వెంకట సతీష్-స్వాతి దంపతులు

రాచపల్లి అరుణాచలేశ్వరునికి వెండి నాగాభరణం బహూకరణ

ప్రత్తిపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని అరుణాచలేశ్వరస్వామికి కాకినాడకు చెందిన గుంటి వెంకటసతీష్-స్వాతి దంపతులు, వారి కుమార్తె జ్యోత్స్న రూ.20లక్షలు విలువచేసే వెండి నాగాభరణం చేయించారు. గురువారం దానిని ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రమణానందకు అందజేశారు. అనంతరం నాగాభరణాన్ని వేదపండితుల మంత్రోచ్చారణలతో అరుణాచలేశ్వరునికి అలంకరించారు. కార్తీక మాసం రెండో రోజు స్వామికి పంచామృత అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన జరిపి పంచ హారతులు ఇచ్చారు.



వెండి నాగాభరణాన్ని స్వామికి అలంకరించిన దృశ్యం

సామర్లకోటలో రైల్వే డీఆర్‌ఎం

రైల్వే ట్రాక్, ముంపు ప్రాంతాల పరిశీలన

సామర్లకోట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ మోహిత్ సోనాకియా గురువారం సామర్లకోట విచ్చేశారు. మూడు రోజుల క్రితం వరద నీటితో రైల్వే ట్రాక్ మొత్తం ముంపునకు గురవ్వడంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుసగా వచ్చిన కథనాలను ఆయన అధికారుల నుంచి సేకరించారు. ట్రాక్ ముంపు సమస్య, స్తంభించిన సిగ్నలింగ్ వ్యవస్థలపై డీఆర్‌ఎంకు స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్, ఏఈఎన్ ప్రభాకర్, చీఫ్ సిగ్నలింగ్ అధికారి చిరంజీవి సమగ్రంగా వివరించారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి ట్రాక్‌ను పరిశీలించారు. రైల్వే స్థలాలతో పాటు పూర్వం నుంచీ ఉన్న పంత మార్గాలు నేడు కనిపించకుండా పోయినందునే ముంపు బెడద తలెత్తుతోందని రైల్వే అధికారులు డీఆర్‌ఎంకు వివరించారు. రైల్వే శాఖకు పూర్వం నుంచీ ఉన్న స్థలాలను సర్వే చేసి శాశ్వత ప్రాతిపదికన డ్రైన్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న చెరువులకు లీజు పరిమితి 2029 వరకు ఉందని చెప్పగా పరిమితి పూర్తయిన అనంతరం లీజు నిలిపివేయాలని డీఆర్‌ఎం సూచించారు. వివిధ శాఖల అధికారులతో వాస్తవంగా ఉన్న రికార్డుల మేరకు సర్వే చేయించి రైల్వే లేదా ప్రభుత్వ స్థలాల్లో శాశ్వత ప్రాతిపదికన డ్రైన్లు నిర్మించి ట్రాక్ పైకి భవిష్యత్తులో వరద నీరు రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువు నుంచి తాత్కాలికంగా తవ్విన కాలువను పరిశీలించారు. 3, 4, 5, 6 ట్రాక్‌లపైకి వరద నీరు చేరకుండా ప్రస్తుతం వున్న మూడు మోటార్లతో పాటు మరో రెండు మోటార్లతో వరద నీటిని పంపింగ్ చేసి బయటకు పంపాలని ఏఈఎన్ ప్రభాకర్‌కు సూచించారు.



రైల్వే ట్రాక్ పైకి వరద నీరు చేరకుండా ప్రత్యేకంగా తవ్విన కాలువను చూస్తున్న డీఆర్‌ఎం సోనాకియా

భావనారాయణస్వామి ఆలయ ఈవోగా శ్రీనివాసరావు



సర్పవరం జంక్షన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (గ్రేడ్-1)గా ఆర్.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఎమ్మెల్యే పంతం నానాజీ సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆయన చెప్పారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన తలాటం సూర్యనారాయణని అభినందించారు.

పిఠాపురం పాదగయలో పూజలు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజరు మోహిత్ సోనాకియా దంపతులు గురువారం విచ్చేశారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ పండితులు క్షేత్ర ప్రాశస్త్యం వివరించి ఆశీర్వచనాలు అందించారు. డీఆర్‌ఎం దంపతులను కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి-అమ్మవార్ల చిత్రపటం అందజేశారు. డీఆర్‌ఎం వెంట సామర్లకోట రైల్వే స్టేషన్ మేనేజరు మద్దింశెట్టి రమేష్, ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, అల్లంరాజు చంద్రమౌళి, సూపరింటెండెంట్ వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దత్తాత్రేయ వున్నారు.



డీఆర్‌ఎం సోనాకియాకు ప్రసాదం అందజేస్తున్న ఈవో జగన్మోహన శ్రీనివాస్

జేఎన్టీయూకే, ఎస్టీబీఐఎఫ్, గోవిన్ హోల్డింగ్స్ మధ్య అవగాహన ఒప్పందం



ఎంవోయూలు మార్చుకుంటున్న జేఎన్టీయూకే వీసీ ప్రసాద్, ఇతర సంస్థల ప్రతినిధులు

జేఎన్టీయూకే, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూకేలోని వైస్ చాన్సలర్ సమావేశ హాల్లో జేఎన్టీయూకే, విశాఖపట్నంలోని ఎస్టీబీఐఎఫ్, సింగపూర్‌లోని గోవిన్ హోల్డింగ్స్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరినట్టు ఎస్ఆర్ఐఐసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎ.గోపాలకృష్ణ తెలిపారు. జేఎన్టీయూ ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, గోవిన్ హోల్డింగ్స్ అధినేత ఆనంద్ గోవిందలూరి, ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు సంతకాలు చేసి అవగాహన ఒప్పంద పత్రాలను ఒకరికొకరు మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఈ సంస్థలు ఆవిష్కరణాత్మక పరిశోధన, స్టార్టప్ ఎకో సిస్టమ్ అభివృద్ధి, అంతర్జాతీయ మార్కెట్ ప్రవేశానికి వేదికలు సృష్టించడం, గ్లోబల్ సహకార అవకాశాలను అన్వేషించడం వంటి రంగాల్లో పరస్పర సహకారం అందించుకోనున్నాయి. ఈ సందర్భంగా ఆనంద్ గోవిందలూరి సమాజానికి నైతిక స్టార్టప్‌ల ప్రభావం అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు పలువురు డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కామాంధుడి కథ ముగిసింది

(5వ పేజీ తరువాయి)

తుని రూరల్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికను అత్యాచారం చేసిన నిందితుడు నారాయణరావు (62)ను పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్ట్ చేయగా, అతడి తక్షణం అరెస్ట్‌తో తగిన శాస్తి జరిగిందని అంతా అనుకున్నారు. పోలీసులు సైతం తమకు పక్కా ఆధారాలతో వీడియో దొరకడం, బాధితురాలిచ్చిన వివరాలు, వైద్య పరీక్షల నివేదిక ఆధారంగా నిందితుడు అత్యాచారం చేసినట్లు నిర్ధారణ అవడంతో రిమాండ్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేశారు. తుని మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపర్చడానికి పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం వీడియో సాక్ష్యం, ఎఫ్ఐఆర్, ప్రాథమిక ఆధారాలు సిద్ధం చేశారు. కానీ తుని మేజిస్ట్రేట్ అందుబాటులో లేకపోవడంతో ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చేందుకు బయలుదేరారు.

బహిర్భూమికి వెళ్లాలని జీపు ఆపి..

రాత్రి పది గంటలకు తునిరూరల్ పోలీసులు నిందితుడిని జీపులో ఎక్కించి ప్రత్తిపాడు మేజిస్ట్రేట్ వద్దకు బయలుదేరారు. కాగా, తాను బహిర్భూమికి వెళ్లాలని జీపు ఆపాలని నిందితుడు కోరాడు. ప్రత్తిపాడులో వెళ్లవచ్చని పోలీసులు చెప్పినా వెంటనే ఆపాలంటూ ఒత్తిడి తెచ్చాడు. దీంతో తుని పట్టణ శివారులోని కోమటి చెరువు వద్ద పోలీసులు జీపు ఆపారు. అదే సమయంలో వర్షం పడుతుండడంతో పక్కనే ఉన్న చెట్టు కిందకు ఎస్కార్ట్ సిబ్బంది వెళ్లి నిలబడ్డారు. ఈలోపు నిందితుడు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశాడు. ఒక్కసారిగా శబ్దం విన్న పోలీసులు చెరువులోకి దిగి గాలించే ప్రయత్నం చేశారు. కానీ జాడ కనిపించలేదు. వెంటనే ఫైర్‌సిబ్బందికి ఫోన్ చేయగా వారు కూడా చాలాసేపు వెతికారు. అయినా జాడ కనిపించలేదు. దీంతో ఉదయాన్నే గజ ఈతగాళ్లను పిలిపించి చెరువులో గాలించారు. వలలు వేసి వెతికారు. చెరువు మధ్యలో కరెంట్ స్తంభం సమీపంలో నిందితుడి మృతదేహం వలకు చిక్కింది. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు మృతుడు నారాయణరావుగా నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మరోపక్క నిందితుడు బుధవారం రాత్రి జైలుకి వెళ్లి ఉంటాడని అనుకున్న వారందరికీ గురువారం ఉదయం మృతి వార్త తెలియడంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

రోజంతా పోలీసుల బందోబస్తు..

అత్యాచార నిందితుడు నారాయణరావు మృతి చెందడం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గురువారం సంచలనమైంది. నిందితుడు తప్పించుకుని పారిపోయే క్రమంలో చనిపోవడంతో పీడవిరగడైందని చర్చోపచర్చలు జరిగాయి. మరోపక్క నారాయణరావు మృతి సమాచారం తెలియడంతో అతడి కొడుకు, కోడలు, కూతురు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వారెవరూ కనీసం విచారం వ్యక్తం చేయకపోవడం విశేషం. నారాయణరావు చేసిన పాపానికి చనిపోవడమే కరెక్ట్ అంటూ కుటుంబీకులు సైతం అసహ్యించుకున్నారు. నిందితుడికి బుధవారం రాత్రి బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు దేహశుద్ధి చేసినప్పుడే తమకు అతడు చేసిన తప్పు అర్థమై దూరంగా ఉన్నామని వివరించారు. స్టేషన్‌కు పోలీసులు తీసుకువెళ్లినప్పుడు కూడా వదిలేశామన్నారు. అయితే నిందితుడు రాత్రి చనిపోయిన విషయాన్ని దాచేసి కోర్టుకు తీసుకువెళ్లడం కోసం తమవద్ద పోలీసులు సంతకం తీసుకున్నారని కొడుకు, కోడలు వాపోయారు. నిందితుడు చనిపోయాడని రాత్రే నిజం చెబితే తామే సంతకం పెట్టేవాళ్లమని వివరించారు. నిందితుడు చెరువులో దూకిన ప్రాంతం వద్ద పోలీసులు రోజంతా బందోబస్తు నిర్వహించారు. అక్కడ ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా నిఘా ఉంచారు. నారాయణరావు మృతదేహాన్ని పోలీసులు తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. శవపంచనామా కోసం కుటుంబీకుల్లో ఒకరు సంతకం చేయాలని పోలీసులు కోరినా ఎవరూ ముందుకు రాలేదు. నారాయణకు ఇద్దరు భార్యలున్నారు. వీరిద్దరికీ సమాచారం ఇచ్చినా మధ్యాహ్నం వరకు ఎవరూ మృతదేహం కోసం ముందుకు రాలేదు. దీంతో సాయంత్రం శవపంచనామా పూర్తయింది.

వైరల్ వీడియోపై పోలీసులు రంగంలోకి..

తొండంగి తోటలో నిందితుడు నారాయణరావు మైనర్ బాలికను అత్యాచారం చేసిన వీడియోలు బుధవారం నుంచీ వైరల్ అవుతున్నాయి. ఈ వీడియోలో బాలిక వీడియోలు స్పష్టంగా కనిపిస్తుండడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. బాలికలు కనిపించేలా ఇలా వీడియోలు పోస్ట్ చేసిన వారిపై పోలీసులు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు వీడియోలు తమ దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని, కానీ ఇలా సోషల్ మీడియాలో వైరల్ చేయడం వల్ల బాలిక భవిష్యత్తుకు ఇబ్బందులు వస్తాయని పోలీసులు హెచ్చరించారు. గురువారం సాయంత్రంలోగా వీటిని సోషల్ మీడియా నుంచి తొలగించాలని బాధ్యులను హెచ్చరించారు. లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కానీ చాలామంది నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించిన పోలీసులు గురువారం సాయత్రం వైసీపీ మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అనుచరుడు గణేశుల వీరబాబు (35)పై కేసు నమోదు చేశారు. అత్యాచార వీడియోలు, నిందితుడి తనయుడు హోంమంత్రి అనిత అనుచరుడిగాను, నిందితుడు మాజీమంత్రి యనమలతోను ఉన్నట్టు మార్ఫింగ్ ఫొటోలను సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

మృతదేహం వద్ద కుటుంబీకుల రోదన



తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసులు కళ్లు గప్పి తప్పించుకునే ప్రయత్నంలో కామాంధుడు నారాయణరావు చెరువులో మునిగి బుధవారం రాత్రి మృతిచెందాడు. కాగా, రాత్రి కురిసిన వర్షం కారణంగా బయటకు తీసేందుకు వీలు లేకపోవడంతో గురువారం వేకువజాము నుంచే నారాయణరావు మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని వెలికితీయడంతో కొడుకు సురేష్, కూతురు నాగలక్ష్మి, కోడలు రాజేశ్వరి మృతదేహం వద్దకు వచ్చారు. అక్కడ ఆందోళన వ్యక్తం చేసిన కొడుకు సురేష్, కోడలు రాజేశ్వరి, తమ తండ్రి చేసిన పనికి శిక్ష పడాల్సిందేనని కానీ చెరువులో పడి చనిపోవడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. అనంతరం మృతదేహాన్ని పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే అత్యాచారానికి గురైన బాలిక తుని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

గురుకులంలో అధికారుల విచారణ



పాఠశాలలో విచారణ చేపడుతున్న దృశ్యం

తుని రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థినిపై వృద్ధుడు తాటిక నారాయణరావు అత్యాచారానికి ఒడిగట్టడం సంచలనం రేకెత్తించిన విషయం తెలిసిందే. దీంతో గురుకుల పాఠశాల ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. స్టేట్ సెక్రటరీ మస్తానయ్య, జాయింట్ సెక్రటరీ అబుల్‌దుల్లా, ఇరువురు పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులతో సమావేశమై బాలిక బయటకు వెళ్లడానికి గల కారణాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నారాయణరావు అనే వ్యక్తి బాలిక తాతయ్యగా చెప్పుకుని పలుమార్లు పాఠశాలకు తినుబండారాలు తీసుకురావడంతో పాటు రెండు సార్లు బాలికను బయటకు తీసుకెళ్లాడన్నారు. తాతయ్యగా నమ్మిన సిబ్బంది బయటకు పంపించడం జరిగిందని, విద్యార్థిని కూడా తమ తాతయ్య అని ధ్రువీకరించిందన్నారు.

ప్రమాదవశాత్తు కత్తి తలపై పడి ఒకరి మృతి

నల్లజర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కత్తి జారి తలపై పడిన ఘటనలో కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన దూబచర్లలో గురువారం చోటుచేసుకుంది. నల్లజర్ల పోలీసుల వివరాలివి... జగన్నాథపురం గ్రామానికి చెందిన పేర్ల నాగేశ్వరరావు (35)కొంతమందితో కలిసి దూబచర్లలో ఆయిల్‌పాం గెలలు కోసేందుకు ఉదయం వెళ్లాడు. కాగా, నాగేశ్వరరావు కత్తితో గెలలు కోస్తున్న సమయంలో ఇనుప గెడకు ఉన్న కత్తి పై నుంచి జారి తలపై పడడంతో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయనకు భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

కరిచర్లగూడెం మాతంగమ్మ ఆలయంలో చోరీ

గోపాలపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరిచర్లగూడెం గ్రామ శివారులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మాతంగమ్మ ఆలయంలో చోరీకి పాల్పడినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు... గ్రామ శివారులో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆలయంలో బుధవారం రాత్రి ఆలయంలో చొరబడి ఉన్న డబ్బీని పగలగొట్టి అందులో ఉన్న సొమ్మును అపహరించుకుపోయినట్టు తెలిపారు. ఇటీవలే ఆలయం వద్ద దసరా ఉత్సవాలు నిర్వహించామని, దీంతో రూ. 10 నుంచి 15000 వేలు వరకు హుండీలో అమ్మవారి కానుకలు ఉన్నాయన్నారు. అలాగే గోపాలపురంలోని కనకదుర్గమ్మ వారి ఆలయంలో కూడా బుధవారం రాత్రి చోరీ జరిగినట్టు విశ్వసనీయ సమాచారం.

డిప్యూటీ సీఎంను కలిసిన కొత్తపేట ఎమ్మెల్యే

కొత్తపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో ముఖ్యమైన 12 రోడ్ల నిర్మాణం కోసం రూ.18.33 కోట్ల నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ముఖ్యంగా రావులపాలెం జాతీయ రహదారి నుంచి వాడపల్లి వరకు ఏటిగట్టు రహదారి నిర్మాణం అవసరమని, దీనికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం దినదిన ప్రవర్తమానంగా వెలుగొందుతున్న కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకోవాలని ఆహ్వానించారు. అలాగే గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు మంజూరు చేయాలన్నారు. వీటిపై పవన్ సానుకూలంగా స్పందించినట్టు ఆయన వివరించారు.

వాడపల్లి క్షేత్రానికి రూ. 6 కోట్లు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతిని గడించిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి డిప్యూటీ సీఎం పవన్ రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. గురువారం రాత్రి మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వాడపల్లి క్షేత్రం గురించి వివరించి గోదావరి ఏటిగట్టు రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరగా, తక్షణమే స్పం దించి పంచాయతీ రాజ్ ద్వారా నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

వాడపల్లి వెంకన్న కొబ్బరి చెక్కల వేలం పాట ఆదాయం రూ.1.63 కోట్లు



వాడపల్లిలోని ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

ఆత్రేయపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వేలం పాటలో స్వామివారికి అధిక ఆదాయం లభించింది. ఏడాది కాలానికి నిర్వహించిన కొబ్బరి చెక్కల వేలం పాటలో సదరు పాటదారుడు రూ.1,63,33,333 హెచ్చుపాటను సొంతం చేసుకున్నాడు. గత ఏడాది రూ.60,77,879కి పలికింది. అలాగే పట్టిక బెల్లంకు నిర్వహించిన వేలం పాటలో రూ. 18,09,000 రాగా, గతంలో రూ.12,35,000, తిరు తిలకధారణకు నిర్వహించిన వేలం పాటలో రూ.17,99,299 రాగా, గతంలో రూ.15,66,666 పాట దక్కించుకున్నారు. అధిక ఆదాయం లభించిన ఈ పాటలలో బహిరంగ వేలం సీల్డ్ టెండర్లు, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. వేలంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తే మానసిక ఆరోగ్యం

- కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్
- ఆర్ఎంసీలో డ్రగ్స్ నియంత్రణపై సదస్సు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడిని అధిగమించడం తద్వారా మానసికంగా, శారీరకంగా ప్రశాంతత లభిస్తుందని కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ అన్నారు. ఆర్ఎంసీలో డ్రగ్స్ నియంత్రణపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు (డ్రగ్స్) ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా కుటుంబాలను నాశనం చేస్తున్నాయన్నారు. ప్రస్తుత వైద్య విద్యార్థులు భవిష్యత్తు వైద్యులుగా మారి సమాజానికి ఆదర్శం కావాలన్నారు. మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ వి.వరప్రసాద్ మాట్లాడుతూ ప్రశాంతమైన మనస్సు, ఆరోగ్యవంతమైన శరీరం వైద్య విద్యార్థులకు ముఖ్యమన్నారు. ఆందోళన, ఒత్తిడి సమస్యలకు ఆర్ఎంసీలో కౌన్సిలింగ్‌తో పాటు మెంటల్ హెల్త్ సపోర్ట్ సిస్టం ఉందన్నారు. అవసరమైన వారు మెంటర్స్/అధ్యాపకులు/ కౌన్సిలర్లను సంప్రదించాలన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు తొడిగిన వైట్ కోట్ కరుణ, క్రమశిక్షణ, వినయం ... ముఖ్యంగా సేవాభావాన్ని గుర్తు చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్, డాక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్య

రాజమహేంద్రవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేశారు. ఈ మేరకు వివరాలను సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ గురువారం తెలి పారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో ఉంటున్న ఓ బాలిక దీపావళి టపాసులు కొనుక్కోడానికి బయటకు వెళ్లింది. ఆ బాలికతో ముందుగానే పరిచయం ఉన్న పాము అజయ్‌తోపాటు అతడి స్నేహితుడు అదే సమ యంలో హాస్టల్ వద్దకు వచ్చారు. తాము కూడా దీపావళి బాణసం చాకు వెళుతున్నామని మాయమాటలు చెప్పి బాలికను బైక్ ఎక్కిం చుకొని రైల్వే స్టేషను సమీపంలోని శ్రీగురు లాడ్జికి తీసుకెళ్లారు. స్నేహి తుడు లాడ్జి బయట ఉండగా, బాలికను అజయ్ రూమ్‌లోకి తీసుకె ళ్లి అత్యాచారం చేసి, వసతి గృహం వద్ద వదిలి వెళ్లాడని.. బాలిక గాబరా ప్రవర్తనను గమనించి వార్డెన్ ప్రశ్నించగా జరిగిన విషయాన్ని చెప్పినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. దీంతో పోక్సో కేసు నమోదు చేసి అజయ్‌తోపాటు కాగితపల్లి సత్యస్వామిని అరెస్టు చేసి న్యాయస్థానంలో ప్రవేశపెట్టామన్నారు. శక్తి టీంలను అప్రమత్తం చేశామన్నారు. వసతి గృహాలకు పంపించి కౌన్సెలింగ్ చేయిస్తున్నామన్నారు. లాడ్జి సిబ్బంది, యజమానులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని, అనుమానమొస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ కోరారు. ఉదాసీనంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

● టూటౌన్ పరిధిలో ఇటీవల ఇది రెండో తీవ్రమైన ఘటన కావడం గమనార్హం. నెల క్రితం పోలీస్ స్టేషనుకు సమీపంలోనే రాత్రి గస్తీ విధుల్లో ఉన్న ఒక కానిస్టేబుల్, హోంగార్డుపై అసాంఘిక వ్యక్తులు దాడి చేసి కానిస్టేబుల్‌ని కొట్టారు. జిల్లాలో పోలీసులపై ఇలాంటి ఘటన ఇదే మొదసారి కావడంతో సంచలనమైంది.ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కి కూతవేటు దూరంలోనే ఉన్న లాడ్జిలో అఘాయిత్యం జరిగింది. దీంతో నిఘా పేలవంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైగా రైల్వేస్టేషను ఏరియా సున్నిత ప్రాంతం కావడంతో స్టేషనుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలనే వినతులు వినవస్తున్నాయి. కేసులో ప్రతిభ చూపిన సీఐ శివ గణేశ్, ఎస్ఐ శ్యాంసుందర్, హెచ్‌సీ భానుమూర్తి, కానిస్టేబుళ్లు రబ్బాని, మహేశ్‌కుమార్, నాగబాబు, బాలసుబ్రహ్మణ్యాన్ని ఎస్పీ కిషోర్ అభినందించారు.

బాలింత మృతిపై విచారణ

పిఠాపురంలో వైద్యులు, సిబ్బంది, మృతురాలి బంధువుల నుంచి వివరాలు సేకరణ



పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో విచారణ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పిఠాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వాసుపత్రి)లో బాలింత మృతి ఘటనపై గురువారం విచారణ నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ డెలివరీ నిమిత్తం ఈనెల 13న ఆసుపత్రిలో చేరగా 14న బిడ్డను ప్రసవించిన అనంతరం అధిక రక్తస్రావమై సీరియస్ కావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మరణించడం. బిడ్డ అనారోగ్యానికి గురికావడంపై మృతురాలి బంధువులు ఆందోళన నిర్వహించగా, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. దీనితో కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి,గైనిక్ హెచ్‌వోడి డాక్టర్ అనురాగమయి, పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ మాణిక్యం, పాడా ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి, జీజీహెచ్ ఏవో శేషేంద్రశర్మ గురువారం పిఠాపురం చేరుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు విచారణ జరిపారు. మృతురాలి బంధువులు, చికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది, ఆ రోజు విధుల్లో ఉన్న పారా మెడికల్ స్టాఫ్ నుంచి వివరాలు సేకరించారు. మృతురాలి కేస్ షీట్, బిడ్డ ఆరోగ్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అందరి నుంచి వివరాలు తీసుకున్నామని, వీటిని క్రోడీకరించి నివేదిక రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. అదేవిధంగా జూలై నెలలో ఇక్కడ డెలివరీ నిమిత్తం చేరగా కడుపులోనే బిడ్డ చనిపోయిందని విరవకు చెందిన దంపతులు తమకు తెలియజేశారని చెప్పారు. దీనిపై పాడా కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించినట్టు తెలిపారు.

పోలవరం భూముల్లో సాగును అడ్డుకున్న ఆదివాసీలు



ఆదివాసీలతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

- భూములపై కలెక్టర్, సబ్ కలెక్టర్ ఉత్తర్వులు అమలు చేయాలి
- లేకుంటే బైండోవర్ కేసులు: అధికారులు

ఎటపాక,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం నందిగామ, ముర్మూరు గ్రామాల్లో పోలవరం పరిహారం పొందిన భూముల్లో వ్యవసాయ పనులు చేస్తున్న పూర్వ యజమానులు గురువారం కొందరు ఆదివాసీలు అడ్డుకున్నారు. నందిగామ, ముర్మూరు గ్రామాల్లో పోలవరం ప్రాజెక్టు కోసం భూసేకరణలో భాగంగా సేకరించి, పరిహారం పొందిన భూముల్లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మూడు నెలల క్రితం ఆదివాసీలు జెండాలు పాతడంతో వివాదం తలెత్తింది.దీనిపై భూముల పూర్వ యజమానులు కలెక్టర్‌కు, సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించి భూసేకరణ ప్రక్రియ, పునరావాస ప్యాకేజీ పూర్తయ్యేవరకు పూర్వ యజమానుల ఆధీనంలో ఆ భూములు ఉంటాయని, ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ శుభం నోక్వాల్ గత నెల 30న ఉత్తర్వుల జారీ చేశారు. ఈ క్రమంలో పూర్వ యజమానులు ఈ రెండు గ్రామాల్లోని భూముల్లో వ్యవసాయ పనులు మొదలు పెట్టగా ఆదివాసీలు అడ్డుకున్నారు. దీంతో తహశీల్దార్ కారం సుబ్బారావు, సీఐ కన్నపరాజు, ఎస్ఐ అప్పలరాజు అక్కడికి వెళ్లారు. ఈ భూములపై కలెక్టర్ దినేష్‌కుమార్, సబ్‌కలెక్టర్ శుభం నోక్వాల్ స్పష్టమైన ఉత్తర్వులు ఉన్నాయని, ఎవరైనా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పూర్వ యజమానులు సాగు చేయకుండా భూములను కౌలు ఇస్తే వారిపై కూడా ఎల్టీఆర్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



రావులపాలెంలో బస్సు ఢీకొని మృతిచెందిన కోటమ్మ

రావులపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతిచెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన అడపాల కోటమ్మ(61) వ్యక్తిగత పనులపై రావులపాలెం వచ్చి పని ముగించుకుని స్వగ్రామం వెళ్లేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు నడుచుకుంటూ వెళ్తోంది. ఆ సమయంలో భీమవరం డిపోకు చెందిన బస్సు కోటమ్మను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాల పాలైన ఆమెను 108 అంబులెన్స్ కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలు మనవుడు ఉండవల్లి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చంటి తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

మరొకరికి గాయాలు



మృతుడు రేగటి దేవుడు

కోటనందూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం కేవో అగ్రహారం శివారులో గురువారం బైక్ అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీస్‌ల వివరాల ప్రకారం.. తుని మండలం ఎన్ఎస్ వెంకట నగరం గ్రామానికి చెందిన రేగటి దేవుడు(33), అతడి చిన్నాన్న యేందుకంద అప్పారావు కలిసి బైక్‌పై కోటనందూరు వెళ్లి తిరిగి వస్తుండగా కేవో అగ్రహారం శివారులో బైక్ అదుపు తప్పింది. దీంతో ఇద్దరికీ బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో తుని ఏరియా అసుపత్రికి తరలించారు. అప్పటికే రేగటి దేవుడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. అప్పారావుకు చికిత్స పొందుతున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టానికి తరలించామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

గొల్లప్రోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సామర్లకోట మండలం గొంచాల గ్రామానికి చెందిన భార్యాభర్తలు గొల్లప్రోలు మండలం చేబ్రోలు వచ్చారు. అక్కడ నుంచి గురువారం సాయంత్రం తిరిగి మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా అకస్మాత్తుగా వర్షం రావడంతో తడిచిపోకుండా ఉండేందుకు గానూ 216వ జాతీయ రహదారిపై చెందుర్తి సెంటర్ వద్ద ఉన్న దుర్గాదేవి గుడి వద్దకు మలుపు తిరిగారు. అదే సమయంలో కాకినాడ నుంచి విశాఖ వెళ్లే కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎటపాక, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన రాజుపేట గ్రామశివారు ప్రాంతంలో అక్రమంగా ఇసుక నిల్వలు ఉంచి గుట్టుచప్పుడు కాకుండా తెలంగాణలోని భద్రాచలం పట్టణానికి రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున ఎస్ఐ జి.అప్పలరాజు పట్టుకున్నారు. గోళ్లగట్టు రోడ్‌లో ఓ ఇసుక ట్రాక్టర్‌ను, రాజుపేట నుంచి భద్రాచలం వెళ్తున్న మరో ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కాగా రాజుపేట వద్ద రెండు చోట్ల అక్రమ ఇసుక నిల్వలు గుర్తించినా రెవెన్యూ అధికారులు సీజ్ చేయకపోవడం గమనార్హం. అయితే పట్టుబడిన రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఘనంగా వైట్ కోట్ సెర్మనీ



రంగరాయలో వైద్య విద్యార్థికి వైట్ కోట్ తొడుగుతున్న డాక్టర్ విష్ణువర్ధన్

జీజీహెచ్(కాకినాడ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో వైట్ కోట్ సెర్మనీ గురువారం ఘనంగా జరిగింది. మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ వైట్ కోట్ తొడిగి వైద్యుడిగా నిర్వర్తించాల్సిన ధర్మాన్ని, వ్యక్తులతో మెలగాల్సిన విధానాన్ని, బాధ్యతలను వివరించారు.నిష్పక్షపాత విధి నిర్వహణకు తెల్ల కోటు ప్రతీక అన్నారు. వైద్య విద్యార్థులు తెల్లకోటు వేసుకున్నప్పటి నుంచీ పరిపూర్ణమైన వైద్యుడిగా పరిపక్వతతో వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విజయశేఖర్, డాక్టర్ శశి, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్‌శ్రీనివాసన్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భారత్ బంద్

- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట లేఖ
- అప్రమత్తమైన పోలీసులు



చింతూరులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ నేడు భారత్ బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.ఆ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్‌పేరిట లేఖ విడుదలైంది. దీంతో సరిహద్దు పోలీసులు అప్రమత్తమయ్యారు. మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చింతూరు భద్రాచలం నడుమ జాతీయ రహదారి 30పై గురువారం రాత్రి రాకపోకలను నిలువరించారు. భద్రాచలం వైపు వెళ్లే ప్రైవేటు వాహనాలను కూనవరం మీదుగా మళ్లించారు. మరోవైపు చింతూరు మీదుగా రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎటపాక, చింతూరు, కూనవరం మండలాల మీదుగా మన రాష్ట్రంలోని విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడలతో పాటు తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్‌ల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను గురు, శుక్రవారాల్లో సాయంత్రం దాటాక నిలిపివేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. జాతీయ రహదార్ల అభివృద్ధి పనులకు వినియోగించే వాహనాలను బంద్ ప్రభావం ముగిసేంత వరకు సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాల్సిందిగా పోలీసులు సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. అనుమానిత ప్రదేశాల్లో నిఘా పెంచామన్నారు.

అమలాపురం



అంబాజీపేటలో కురుస్తున్న వర్షం

కుండపోతగా వర్షం

- పొంగుతున్న డ్రెయిన్లు
- నేలనంటిన వరిచేలు, రైతుల ఆందోళన
- స్తంభించిన జనజీవనం

ముమ్మిడివరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావంవల్ల ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. గత మూడు రోజులుగా వర్షం కురుస్తున్నా గురువారం మాత్రం తెల్లవారుజాము నుంచి కుండపోతగా వర్షం కురిసింది. జిల్లాలో 43 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా ఉప్పలగుప్తం మండలంలో 79.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా రాయవరం మండలంలో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మురుగునీటి కాల్వలు, పంటకాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఖరీఫ్ వరి అక్కడక్కడా నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముమ్మిడివరంలో 67.4 మిల్లీమీటర్ల వర్షపాతం

మండలంలో 67.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అధిక వర్షానికి పంటకాల్వలు, మురుగునీటి కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో రోడ్లు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. డ్రైనేజీల్లో నీరు, రోడ్లపై నీరు కలిసి వాగులను తలపిస్తున్నాయి. ముమ్మిడివరంలోని పోలీసుస్టేషన్ ఆవరణ, తహశీల్దార్ కార్యాలయ ఆవరణ నీట మునిగింది. సబ్‌ట్రెజరీ కార్యాలయంలోకి వర్షపునీరు ప్రవేశించడంతో ఆ నీటిలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సాయినగర్, జీఎంసీ బాలయోగి కాలనీతోపాటు పలు జగనన్న కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. గురువారం ఉదయంనుంచి ఏకధాటిగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది.

నీటి ముంపులో చేలు

అల్లవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. వాసాలతిప్ప, కుమ్మరికాల్వ, పంచనది, లోయర్‌కౌశిక, వాటి అనుబంధ డ్రెయిన్లు ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరుచేరి నిండు కుండలా తయారైంది. వర్షాలకు గట్లు దెబ్బతిన్నాయని ఆక్వా రైతులు, చేపల రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో చెరువులు నిండడంతో రొయ్యలు, చేపలు కొట్టుకుపోకుండా రైతులు ఆప వలలతో రక్షణ చర్యలు చేపట్టారు. వర్షాల కారణంగా గోడి, మొగళ్లమూరి, శిరగట్లపల్లి, సామంతకుర్రు, దేవగుప్తం, బోడసకుర్రు, కొమరగిరిపట్నం, ఓడలరేవు తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం అయ్యాయి. వర్షాలకు ఓడలరేవు, శిరగట్లపల్లి, రామేశ్వరం, రెల్లుగడ్డ రోడ్లు దెబ్బతిన్నాయి. భారీవర్షంతో బయటకు రాకుండా జనంఇళ్లకే పరిమితమయ్యారు.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): గత రెండురోజులుగా ఎడతెరిపిలేని వర్షం కురవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రహదారులు జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలు, డ్రైనేజీ పొంగి ప్రవహించాయి. పంటచేలులో నీరు చేరింది. కొబ్బరితోటలు, అరటి తోటల్లో వర్షపునీరను నిలిచిపోయింది. పలు వరిచేలు నీటమునిగిపోవడంతో రైతులు ఇబ్బందులుఎదుర్కొన్నారు.

దంచికొట్టిన భారీ వర్షం

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): గురువారం భారీ వర్షం దంచి కొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలలో ఉన్న పలు కాలనీలు, పంటచేలు, కొబ్బరి తోటలు సైతం జల మయమయ్యాయి. మండలంలోని పలుచోట్ల వరిచేలు నేలనంటాయి. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేని కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయి స్థానిక ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు ఆరుగంటలపాటు ఎడతెరుపు లేకుండా భారీవర్షం పడటంతో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. వర్షం కారణంగా పలు విద్యాసంస్థలకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు. మండలంలోని వరిచేలు ఈనిక దశలో ఉండటంతో ముఖ్యంగా స్వర్ణ రకానికి ఇబ్బంది వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

మండలం అతలాకుతలం

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కాలనీల్లోకి నీరుచేరి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆదేశాల మేరకు సఖినేటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ చిట్టిబాబు ముంపు నీటిని మళ్లించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులను చేపట్టారు. అంతర్వేది, దేవస్థానం, పల్లిపాలెం, కేశవదాసుపాలెం, గొంది ప్రాంతాల్లో వర్షపునీరు చేరి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పాఠశాలల ఆవరణలు వర్షపు ముంపు నీటితో విద్యార్థులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

భారీ వర్షానికి స్తంభించిన జనజీవనం

కాట్రేనికోన(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు రంగరాజుకోడు, ఇరమండ డ్రెయిన్, ఓల్డ్‌అయినాపురం, గెద్దనపల్లి, కందికుప్ప డ్రెయిన్లతో పాటు 34 మైనర్ డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. చేలల్లోని నీరు డ్రెయిన్లలోకి దిగడం లేదు. ఈనిన చేలు నేలనంటాయి. మత్స్యకారులు చేపలవేట లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆక్వా చెరువులకు నష్టం జరిగింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. కందికుప్పలో భారీ వృక్షం ఆర్ అండ్‌బీ రహదారిపై కూలింది.

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): గురువారం ఎడతెరపిలేకుండా కురిసిన భారీ వర్షానికి మండలంలో జనజీవనం అస్తవ్యస్థమైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంటకాల్వలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. సార్వా పొలాలు ముంపు బారిన పడ్డాయి. రంగరాజుకోడు, ఓల్డ్‌అయినాపురం, గొరగనమూడి, కూనవరం మేజర్ డ్రెయిన్‌తో పాటు ఓల్డ్‌సమనస, న్యూసమనస, ఉత్తర, దక్షిణ వీకాలేరు డ్రెయిన్లు గట్లు పొర్లి ప్రవహించడంతో పొలాలు ముంపు బారిన పడ్డాయి.

యానాంలో స్తంభించిన జనజీవనం

యానాం(ఆంధ్రజ్యోతి): తుపాన్ నేపథ్యంలో వాతావరణంలో మార్పు చోటుచేసుకోవడంతో భారీ ఉరుములు, మెరుపులతో కూడినవర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రివరకు ఏడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచి పాఠశాలలు, కళాశాలకు ప్రభుత్వం సెలవు ప్రకటించారు. శుక్రవారం యానాం విద్యాశాఖ పరిధిలోని అన్ని ప్రాథమిక పాఠశాలకు సెలవు ప్రకటించినట్లు ఆర్‌ఏ అంకిత్‌కుమార్ తెలిపారు. అదేవిదంగా ముంపు ప్రాంతాలను, డ్రైనేజీ వ్యవస్థను యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ అధికారులతో కలసి పర్యవేక్షంచడంతోపాటు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

జలదిగ్బంధంలో పశువుల్లంక రహదారి

ఐ.పోలవరం(ఆంధ్రజ్యోతి): గురువారం విరామం లేకుండా కురిసిన భారీ వర్షానికి మండలంలోని లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రధాన రహదారులు సైతం ముంపునకు గురయ్యాయి. రహదారులు చెరువులను తలపించాయి. 216 జాతీయ రహదారి మురమళ్ల సెంటర్ నుంచి పశువుల్లంకకు వెళ్లే ప్రధాన రహదారి జలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు ముంపు బారిన పడ్డాయి.



యానాంలో కురుస్తున్న వర్షం



ముమ్మిడివరంలో నీట మునిగిన ఆసుపత్రి వీధి



గంటిపెదపూడిలో జలమయమైన కాలనీ సీసీరోడ్డు

జ్వరాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి

- రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



రాజోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలవల్ల పారిశుధ్యం క్షీణించకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రాజోలు, మామిడికుదురు మండలాలకు చెందిన కార్యదర్శులు, సర్పంచ్‌లు, వైద్య సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను ఆదర్శంగా తీసుకుని అధికారులు పని చేయాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఇళ్ల వద్ద చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, బ్లీచింగ్ చల్లాలని, ఫాగింగ్ చేపట్టాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రతీ ఇంటిని సందర్శించి ప్రజలు జ్వరాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు చెందిన 50శాతం సాధారణ నిధులు, 30 శాతం 15వ ఆర్థిక సంఘం నిధులు పారిశుధ్యానికి ఖర్చు చేయాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. గోదావరి డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, జడ్పీటీసీ మట్టా శైలజ, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, దిరిశాల బాలాజీ, వైస్‌ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, అడబాల విజయ్, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికార యంత్రాంగం అందుబాటులో ఉండాలి

మలికిపురం(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం, ఎన్డీఏ కూటమి నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఆరోగ్య సిబ్బంది, మండలస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను తొలగించడానికి ఏవిధమైన చర్యలు తీసుకుంటున్నారని అడిగారు. పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ వర్షాలవల్ల ముంపునకు గురైన ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా గండ్లు కొట్టి బయటకు పంపిస్తున్నామన్నారు. అంటురోగాలు ప్రబలకుండా చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ప్రజలు కష్టాల్లో ఉన్నారని, వారికి అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, సర్పంచ్‌లు యెనుముల నాగు, రాపాక ఆనంద్‌కుమార్, కార్యాలయ ఏవో మిల్టన్ పాల్గొన్నారు.

బాలయోగీశ్వరులకు ప్రముఖుల పూజలు



బాలయోగీశ్వరులను దర్శించుకున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సుబ్బరాజు

ముమ్మిడివరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని శ్రీభగవాన్ పెదబాలయోగీశ్వరుల 95వ జన్మదిన వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, గోపూజ, ప్రత్యేక అభిషేకాలు, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి ముమ్మిడివరం పురవీధుల్లో బాణసంచా కాల్పులు, బ్యాండు మేళాలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాల మధ్య ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, నాయకులు గుత్తుల సాయి, తాడి నరసింహారావు, దాట్ల బాబు, కటికదల చినసుబ్బారావు, కటికదల నాని, కాశి రామచంద్రరావు, కాశి బాలమునికుమారిలతోపాటు పలువురు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు



హీరో ప్రభాస్ జన్మదిన వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ హరీష్

అమలాపురంరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): యంగ్ రెబల్‌స్టార్ ప్రభాష్ జన్మదిన వేడుకలను టౌన్‌వైడ్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో గురువారం అమలాపురం క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్‌చేశారు. ప్రభాస్ అభిమానులు చేస్తున్న సేవా కార్యక్రమాలను హరీష్‌బాలయోగి అభినందించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన అభిమానులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, కూటమి నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు, మోకా వెంకటసుబ్బారావు, యేడిద శ్రీను, నల్లా చిట్టిబాబుతో పాటు పలువురు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



క్రీడాకారిణిని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

యానాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్ జిల్లాలో భారత బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న 71వ సీనియర్ జాతీయస్థాయి మహిళల బాల్‌బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ సాధించిన క్రీడాకారిణి ఇసుకపట్ల బిందుశ్రీని యానాం బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. గత నెలలో జరిగిన జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున పాల్గొని తృతీయ స్థానం సాధించి కాంస్య పతకాన్ని, భారతదేశంలో అత్యంత విలువైన స్టార్ ఆఫ్ ఇండియా బహుమతితోపాటు తమిళనాడు రాష్ట్రం సీఎం కప్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పీఎస్ఎస్ఏ కళాశాల తరుపున పాల్గొని మహిళా విభాగంలో ప్రథమస్థానం సాధించిది. తాళ్లరేవు బాల్ బ్యాడ్మిటన్ క్రీడాకారిణి బిందుశ్రీ ప్రతిభను అభినందిస్తూ యానాం క్లబ్ కార్యదర్శి కాపాగంటి అనురాగ ఆదర్శ శేషసుమన్, కోచ్ బొట్టా శ్రీనివాస్, సీనియర్ క్రీడాకారుడు రాయపురెడ్డి విజయ్‌సమక్షంలో రూ.5వేల విలువచేసే క్రీడా సామగ్రిని బహూకరించారు.

గరుడేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన



పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు

పి.గన్నవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గరుడేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమం జరిగింది. రాజమహేంద్రవరం వాస్తవ్యు డు దువ్వూరి వేదవ్యాస్, శ్రీమతి నాగవెంకట సూరలక్ష్మి దంపతులు కర్తలుగా పాల్గొనగా బ్రహ్మశ్రీ శ్రీపాద మాణిక్యావధానులు ఆధ్వర్యంలో శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ పూజ్యం విశ్వనాథశర్మ పరివేక్షణలో రుత్వికులచే శ్రీబాల త్రిపుర సుందరి సమేత గరుడేశ్వరస్వామి వారికి కార్తీక మాసంలో తొలి లక్ష బిల్వార్చన, అమ్మవారికి కుంకు మార్చ నలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్ర సాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

మామిడికుదురు, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులో ఉన్న శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని భక్తులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన ఈలి శ్రీనివాస్-మంగతాయారు దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిత్యాన్నదానానికి విరాళం

మామిడికుదురు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఎస్.బాలాజీ-గంగారత్నం దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. విరాళమందించిన భక్తులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి చిత్రపటంతోపాటు ప్రసాదాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మామిడికుదురులో లక్ష బిల్వార్చన పూజ నిర్వహిస్తున్న భక్తులు

లంక ప్రజల చిరకాల కోరిక తీర్చా

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మామిడికుదురు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మూడు లంక గ్రామాల ప్రజల చిరకాల కోరిక అయిన అప్పనపల్లి కాజ్‌వే నిర్మాణానికి నిధులు సాధించినట్లు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. బి.దొడ్డవరం నుంచి పెదపట్నంలంక వెళ్లే రోడ్డుతోపాటు అప్పనపల్లి కాజ్‌వే నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.14.50 కోట్ల వ్యయంతో కాజ్‌వే, రోడ్లను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 90 శాతం రోడ్లను ఇప్పటివరకు అభివృద్ధి చేశానని, ప్రాధాన్యతా క్రమంలో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పెదపట్నంలంక రోడ్డు నిర్మాణానికి రూ.1.10 కోట్లు మంజూరయ్యాయని, టెండరు ప్రక్రియ జరుగుతుందని, అది పూర్తి కాగానే పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు జాలెం శ్రీనివాసరాజా, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సర్పంచ్ చెల్లుబోయిన రామసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు వాసంశెట్టి వెంకటరమణ, కొమ్ముల జంగమయ్య, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, నాయకులు బోనం బాబు, ఎంకే రజా, పసుపులేటి మహలక్ష్మిరావు, పేరూరి సతీష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్కూలుగేమ్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



స్కూలు గేమ్స్ పోటీల్లో ప్రతిభ చాటిన ఆదిత్య విద్యార్థులు

అమలాపురంటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో అమలాపురం గొల్లగూడెం ఆదిత్య స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటి డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో ఆర్.చైతన్యసాగర్ షాట్‌పుట్‌లో తృతీయస్థానం, టి.మణికంఠ 200మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం, కె.రుత్విక్ వంద మీటర్ల పరుగులో 5వ స్థానం సాధించారు. అండర్-14 విభాగంలో యు.జోయల్ షాట్‌పుట్‌లో 4వ స్థానం, వి.రాజ్‌కుమార్ 400 మీటర్ల పరుగులో ద్వితీయస్థానం, 800 మీటర్ల విభాగంలో మొదటిస్థానం దక్కించుకుని డివిజన్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ కె.లక్ష్మీదేవి అభినందించారు.

దొరబాబుకు ఎమ్మెల్యే పరామర్శ



పార్వతీదేవి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎమ్మెల్సీ రాజశేఖర్

కాట్రేనికోన, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో బాధపడుతున్న రంభాల దొరబాబును గురువారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పరామర్శించారు. మృతురాలు పార్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దొరబాబును పరామర్శించిన వారిలోని మ్మకాయల జగ్గయ్యనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు చెల్లి సురేష్, నడింపల్లి సుబ్బరాజు, దాట్ల పవన్, నంద్యాల చంటి, జనసేన నాయకుడు కొర్లపాటి గోపి, రంబాల చిట్టిబాబు, రంబాల చౌదరిబాబు, రంబాల మూలాస్వామి, సుభాష్‌చంద్రబోసు ఉన్నారు.

గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

మలికిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అధిక వర్షాలవల్ల ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంచాయతీ కార్యదర్శులు సత్వర చర్యలు చేపట్టారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచనలతో గ్రామాల్లో ముంపునీరు పోవడానికి జేసీబీలతో గండ్లు కొట్టారు. పల్లపు ప్రాంతాల్లో చెత్తను తొలగించే చర్యలు చేపట్టారు.

ప్రముఖ సాహితీవేత్త సత్యనారాయణ మృతి



అమలాపురంటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, విశ్రాంత ప్రిన్సిపాల్ పోచినపెద్ది కామసత్యనారాయణ (88) గురువారం ఉదయం వృద్ధాప్యంతో మృతి చెందారు. అమలాపురం వెత్సావారి అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సత్యనారాయణ 1996లో పదవీ విరమణ చేశారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కామ సత్యనారాయణ రచించిన శివానందలహరి, సౌందర్యలహరి, శివమహిమాన్విత స్తోత్రం, లక్ష్మీనృసింహ కరావలంబం వంటి స్తోత్రాలకు రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో పాఠకుల మన్ననలు పొందేలా తాత్పర్యాలను ఆయన వివరించారు. అమలాపురం పట్టణంతోపాటు ఉమ్మడి జిల్లాలో జరిగిన అనేక సాహితీ సభలకు ముఖ్యవక్తగా, అధ్యక్షుడిగా ఆయన వ్యవహరించారు. ఐదు దశాబ్దాలుగా సాహితీ సేవలు అందించిన సత్యనారాయణ మృతి సాహితీ లోకానికి తీరని లోటని వీజీఎస్ ప్రచురణ సంస్థ అధినేతలు శిరం రామారావు, నారాయణరావు పేర్కొన్నారు. సాహితీ అభిమానులు భమిడిపాటి నరసింహశాస్త్రి, వేగేశ్న సుబ్బరాజు, పేరి లక్ష్మీనరసింహం, పుత్సా కృష్ణకామేశ్వర్ తదితరులు సంతాపం తెలిపారు.

అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఏపీఎస్‌పీ కమాండెంట్ విరల్

ముమ్మిడివరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా ముమ్మిడివరం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పి.హనుమంతరావు అధ్యక్షతన గురువారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కాకినాడ జిల్లా ఏపీఎస్పీ కమాండెంట్ విరల్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోలీసులసేవా నిరతిని విద్యార్థులకు వివరించారు. 1996లో విధి నిర్వహణలో అసువులు బాసిన ముమ్మిడివరానికి చెందిన ఏపీఎస్పీ పోలీసు బొక్కా వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయుడు ఎన్.సత్యనారాయణ, ఎన్.సుబ్బారావు, ఉపాధ్యాయులు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

మలికిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మలికిపురం మార్కెట్ రోడ్డులో చొప్పల శివ అలియాస్ సుధాకర్ (55) అనే వ్యక్తి మృతి చెందినట్టు మలికిపురం ఎస్ఐ ఈవీవీ సురేష్ తెలిపారు. కేశవదాసుపాలానికి చెందిన శివ గత కొంత కాలంగా మలికిపురంలో ఒక మహిళతో సహ జీవనం చేస్తున్నట్టు తెలిపారు. ఆమె, శివ 2020లో జరిగిన హత్య కేసులో నిందితులన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న శివ మలికిపురం మార్కెట్ సెంటర్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించాడన్నారు. అతని కుమారుడు కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

మలికిపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మారుతున్న జీవనశైలి అనారోగ్యకరమైన ఆహార అలవాట్లు, పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం, సిగరెట్, మద్యపానం అలవాట్లు కేన్సర్ రోగులు పెరగడానికి ప్రధాన కారణమని కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల సర్జరీ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందుకూరి కావ్య అన్నారు. మలికిపురం డిగ్రీ కళాశాలలో బయోలాజికల్ సైన్స్ విభాగం నిర్వహించిన కేన్సర్ అవగాహన సదస్సులో డాక్టర్ కావ్య మాట్లాడుతూ ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగించే జంక్ ఫుడ్ విడనాడాలన్నారు. పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్యను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆనందమహానీ, సీహెచ్ సత్యనారాయణ, సూర్యనారాయణరాజు, రమేష్‌బాబు, పీడీకే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ధర్నా



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

అమలాపురంటౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణచేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ బహుజన సమాజ్‌పార్టీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. బీఎస్పీ జిల్లాశాఖ అధ్యక్షుడు బూసి జాన్‌మోషే ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఉమ్మడిజిల్లాల ప్రతినిధులతోపాటు రాష్ట్ర ప్రతినిధులు పాల్గొని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గెడ్డం సంపదరావు, కొల్లాబత్తుల సత్యంమాట్లాడుతూ గత వైసీపీ ముఖ్యమంత్రి జగన్ 50శాతం వైద్య సీట్లను ప్రైవేటు సంస్థలకు అమ్ముకుంటే కూటమి ప్రభుత్వం వంద శాతం ప్రైవేటు సంస్థలకు అమ్ముకోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను వైద్యులను చేయకుండా చేస్తున్నారని విమర్శించారు. ధర్నా అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మాత సుబ్రహ్మణ్యం, జిల్లా ఇన్‌చార్జి కుసుమ వెంకటేశ్వరరావు, వాకపల్లి భీమారావు, ఉపాధ్యక్షుడు జిత్తుక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఐ.ప్రియదర్శిని, కోనాల ప్రకాష్, కాండ్రేగుల గంగరాజు, పొలమూరి మోహన్‌బాబు, తాడి రాంబాబు, పెయ్యల ప్రతాప్, నల్లి ప్రసాదరావు, బడుగు భీమేష్, గుర్రపు కొత్తియ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం నాణ్యత తెలుసుకోండి: ఎక్సైజ్ సీఐ



మద్యం నాణ్యతపై ప్రచార పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఎక్సైజ్ సీఐ

అమలాపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మద్యం నాణ్యతపై స్కానర్ ద్వారా తెలుసుకోవాలని అమలాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. సర్కిల్ పరిధిలోని మద్యం షాపుల్లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ప్రచారం చేయడంతో పాటు వాటిని ఆయా షాపుల వద్ద ప్రదర్శిస్తున్నారు. వీరు కొనుక్కున్న మద్యం నాణ్యమైనదేనా అనే విషయం తెలుసుకునేందుకు అక్కడ అంటించిన స్టిక్కర్లను స్కానర్‌ల ద్వారా చెక్ చేస్తే నాణ్యత తెలుస్తుందని, దీనిపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని సీఐ సత్యనారాయణ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తూ వాటిని ఎక్సైజ్ కార్యాలయం వద్ద సిబ్బందితో ప్రదర్శింపచేశారు.

చెత్త సమస్యను పరిష్కరించాలని రిలే దీక్షలు

అమలాపురంరూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బండారులంకలో చెత్త సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఎనిమిదో రోజు భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా రిలే దీక్షలు చేపట్టారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద ఎనిమిదో రోజు దీక్షలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దంగేటి వీరవెంకటసత్యనారాయణ (బుల్లబ్బులు), 7వ వార్డు ఇన్‌చార్జి యిళ్ల త్రిమూర్తులు, ఎంపీటీసీ గుత్తుల జానకీలక్ష్మి, దంగేటి రుద్ర, జక్కంశెట్టి సతీష్, గుత్తుల మురుగులరాజు, గుత్తుల సత్తిబాబు, దంగేటి దుర్గాప్రసాద్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని నాయకులు కామిశెట్టి శ్రీనివాసరావు, సరెళ్ల రామకృష్ణ, వాసా దొరబాబు, జాన గణేష్, పెదపూడి బాబూరావు, కొప్పాడి దుర్గారావు, సరెళ్ల మల్లేశ్వరరావు, గోసంగి శ్రీను, కారుపర్తి మల్లేష్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



కె.గంగవరం మండలంలో పడిపోయిన వరిచేలు

భారీ వర్షాలకు స్తంభించిన జనజీవనం

• ఆందోళనలో అన్నదాతలు • నేలకొరిగిన వరిపంట • తడిసి ముద్దవుతున్న ఇటుక బట్టీలు • లోతట్టు ప్రాంతాలు జలమయం

కె.గంగవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దీంతో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, జనజీవనం స్థంభించింది. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల ఆటస్థలాలు, పాఠశాలలకు వెళ్లే రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మరోవైపు ఈనికలు పూర్తి చేసుకున్న ఆయా వరి పొలాలు నేలనంటుతున్నాయి. వర్షం నీరు నిల్వ ఉండిపోతే నెలకొరిగిన వరి కంకులు కుళ్లిపోతాయని, దీనివల్ల దిగుబడులు పడిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్థంభించింది. లోతట్టు ప్రాంతాలకు నీరు చేరడంతో ఆయా ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైన్లు పొంగిపొర్లడంతో ప్రజలు మరిన్ని అవస్థలు పడ్డారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు ప్రాంతాల్లో వరిచేలు నేలనంటాయి. ఈనిక దశలో వరిచేలు ఉండగా, కొన్ని ప్రాంతాల్లో పంటదశకు రావడం, మరికొన్ని చోట్ల నేలనంటడంతో ఆయా ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటచేతికొచ్చే సమయంలో వర్షం నీటిలో చేలు ముంపునకు గురవడం పట్ల ఆవేదన చెందుతున్నారు. భారీ వర్షం కారణంగా ఇటుక బట్టీల్లో నీరు చేరి ముద్దయి పాడైపోయిందని బట్టీ యజమానులు వాపోతున్నారు. ఉద్యాన పంటలకు పలుచోట్ల తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన పంట నష్టానికి గురవడంతో ఆయా ప్రాంత రైతులు దిగాలు చెందుతున్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో ఆలమూరులో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. భారీ వర్షాల కారణంగా వరిపంటకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. ప్రస్తుతం గింజగట్టిపడే దశలో ఉండటంతో భారీ వర్షాలకు పంట నేలకొరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఆయా కాలనీల్లోకి వర్షపునీరు చేరడంతో ముంపునకు గురయ్యాయి. ఆలమూరులోని జనార్దనస్వామి ఆలయంలోకి వర్షపు నీరు చేరి ఆలయ ప్రాంగణం పూర్తిగా ముంపునకు గురయ్యింది. ఆయా ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ఆలమూరులో భారీ వర్షానికి దేవాలయంలోకి చేరిన నీరు

స్తంభించిన జనజీవనం

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజుల నుండి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు పల్లపు ప్రాంతాలు జలమయం కావడంతో జనజీవనం స్తంభించింది. గురువారం ఉదయం నుండి రాత్రి వరకూ ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలకు వరిచేలు నీటమునగగా గాలులకు ఒరిగిపోయి నేలనంటాయి. వరిపొలాలు ఈనిక, పొట్టదశలో ఉన్నాయి. ఆకాల వర్షాల కారణంగా పంటలు పాడైపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుండపోత వర్షం

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షానికి మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు కుండపోతగా వర్షం కురుస్తోంది. దీంతో రావులపాలెం తహసీల్దారు కార్యాలయం రోడ్డు, రింగ్ రోడ్డు, ప్రభుత్వ కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, క్రీడా మైదానాలు వర్షం నీటిలో చిక్కుకున్నాయి. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది.

నేలకొరిగిన వరిచేలు

మండపేట(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండపేట నియోజకవర్గ పరిధిలో వరిపంట దెబ్బతింది. ఆయా ప్రాంతాల్లో మురుగుకాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట చేతికందే సమయంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండాపోయింది. ముంపుబారిన పంటను రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గ పరిధిలోగల మండపేటతోపాటు కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లో భారీ వర్షాలకు వరి పంట దెబ్బతింది. ఉద్యాన పంటలకు కూడా భారీ నష్టం వాటిల్లింది.

కంట్రోల్ రూం ఏర్పాటు: భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండపేట మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. అత్యవసర సర్వీసుల నిమిత్తం శానిటరీ, ఎలక్ట్రికల్‌కు సంబంధించిన సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలు 98499 06527కి ఫోన్ చేసి ఆయా సేవలు పొందాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే అక్కడి పరిస్థితిపై ఫొటోలు తీసి వాట్సాప్‌కు పంపించిన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. తమ సిబ్బంది 24 గంటలు సేవలు అందించేందుకు సిద్ధంగా వున్నారని ఆయన అన్నారు.



మండపేటలో నేలవాలిన వరిని కట్టలు కడుతున్న రైతు



రావులపాలెం తహసీల్దారు కార్యాలయం రోడ్డులో వర్షంనీరు



కపిలేశ్వరపురంలో జలమయంగా మారిన రహదారి

బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి, తుని ప్రాంతాల్లో జరిగిన అత్యాచార ఘటనలో బాధ్యులైన ఏఎస్‌డబ్ల్యూఓ, ప్రిన్సిపాల్‌ను తక్షణం సస్పెండ్ చేయాలని పీడీఎస్‌యు, పీవైఎల్ సంఘాలు డిమాం డ్ చేశాయి. వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థినులపై అత్యాచారం జరగడం సిగ్గుచేటని పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమశాఖ నిర్లక్ష్యం వల్లే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయని వారు విమర్శించారు. వసతిగృహాల్లో భద్రత కొరవడిందని, విద్యార్థులు ఫిర్యాదు చేసేంత వరకు హాస్టలు వార్డెన్, ఎఎస్‌డబ్ల్యూవోలపై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఈ ఘటనలో సమగ్ర విచారణ జరపాలన్నారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, బాలికలకు 24 గంటలూ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు కె.నవీన్, ఎం.మనోహర్, పీవైఎల్ నాయకుడు వెంటపల్లి భీమశంకరం, అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు గంగవరంలో ఉచిత వైద్య శిబిరం

కె.గంగవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో శుక్ర, శనివారాల్లో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. కె.గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. వీటిని పైప్‌లైన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగాను, ట్రిటీ హాస్పిటల్స్ ఫౌండేషన్ బెంగళూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో అనుభవజ్ఞులైన వైద్యులతో పలు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఆలయాలకు నిధులు మంజూరుపై హర్షం

కొత్తపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఆయా ఆలయాలకు దూపదీప నైవేద్యాల పథకం కింద నిధులు మంజూరు కావడంపై దేవదాయ శాఖ మాజీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి దూనబోయిన నారాయణరావు హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దేవదాయశాఖ కమిషనరు రామచంద్రమోహన్‌ను కలిసి విజ్ఞప్తి చేయగా కొత్తపేట బంగారమ్మ ఆలయానికి, వానపల్లి రమాసత్యనారాయణస్వామి ఆలయానికి, అదే విధంగా కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం గ్రామదేవత శ్రీతాళమ్మ అమ్మవారి ఆలయాలకు దూపదీప నైవేద్యం పథకంలో పెండింగ్ నిధులను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మిద్దే సత్యనారాయణ, కముజు వెంకటేశ్వరరావు, విజయ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు చేయాలి

కె.గంగవరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని సివిల్ సప్లైస్ అధికారి వినయ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్ల కోసం నియమించబడిన టెక్నికల్ సిబ్బంది, డేటా ఆపరేటర్‌లకు శిక్షణ ఇచ్చారు. దీనిలో సివిల్ సప్లైస్ నుంచి వచ్చిన టెక్నికల్ అధికారి వినయ్ ధాన్యం కొనుగోళ్లలో చేయాల్సిన అంశాలు వివరించారు. శ్యాంపిల్స్ సేకరించడం, సేకరించిన శాంపిల్స్‌లో ఎఫ్ఏక్యూ నార్మ్స్ ఏవిధంగా తనిఖీ చేయాలో తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ.సద్గురు మూర్తి, ఆర్ఐ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న సివిల్ సప్లైస్ టెక్నికల్ అధికారి వినయ్

25న జాబ్‌మేళా

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి సుభాష్ కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలిపింది. హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరో స్పేస్, భారత్ బయోటెక్, మహీంద్ర అండ్ మహీంద్ర ట్రాక్టర్స్ కంపెనీల్లో పలు ఉద్యోగాలకు నియామకాలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 95154 81671లో సంప్రదించాలని కోరారు.

నేడు పీఠంలో సౌందర్యలహరి పారాయణం

రాయవరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శుక్రవారం ఆధ్యాత్మికవేత్త సుధా స్వామి, ఆమె శిష్య బృందంతో సౌందర్యలహరి పారాయణ నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. గురువారం పీఠంలో అడ్మినిస్ట్రేటర్ మాట్లాడుతూ పీఠాధిపతి గాడ్ సమక్షంలో ఉదయం 9 గంటల నుంచి సుధాస్వామిచే సౌందర్యలహరి పారాయణ జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో భక్తజనం పాల్గొనాలన్నారు.



కంప్యూటర్లు అందజేస్తున్న కరూర్ వైశ్యా బ్యాంకు ప్రతినిధులు

భీమేశ్వరాలయానికి కంప్యూటర్లు అందజేత

ద్రాక్షారామ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి కరూర్ వైశ్యా బ్యాంకు రెండు కంప్యూటర్లను అందజేసింది. గంగవరం గ్రామీణ చైతన్య బ్యాంకు ఒక కంప్యూటర్‌ను విరాళంగా అందించింది. కార్తీకమాసం సందర్భంగా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు.

కోటి సంతకాలపై 28న రచ్చబండ

ఆత్రేయపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కోటి సంతకాల రచ్చబండ కార్యక్రమం చేపడుతున్నట్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, పార్టీ జిల్లా పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, పార్టీ పరిశీలకులు పి.శివకుమార్ పేర్కొన్నారు. గురువారం వాడపల్లిలో దీనికి శ్రీకారం చుట్టారు. తొలుత వారు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రైవేట్ కళ్యాణ మండపంలో సంతకాల సేకరణ ప్రారంభించారు. అక్టోబరు 28న మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా సేకరణ రచ్చ బండ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులు సంతకాలు సేకరణ చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైందని వక్తలు తెలిపారు. ఇందులో భాగంగా వైద్యం కోసం దర ఖాస్తు చేసుకున్న 25 మందికి మం జూరైన రూ.12,79,254 సాయం చెక్కు లను గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. తమకు ఆర్థికసాయం మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు బాధితులతోపాటు వారి కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత గ్రంథాలయ మాజీ చైర్మన్ వీర్రెడ్డి, గోసాల ప్రసాద్, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

టేకి, నల్లూరులో ఉపాధి గ్రామసభలు

కపిలేశ్వరపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకి, నల్లూరు గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద గురువారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన జరిగిన గ్రామసభల్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆయా గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనుల నివేదికను వినిపించారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని జేఈ రవికుమార్ సూచించారు. టేకిలో 46 పనులు, నల్లూరులో 33 పనులను గుర్తించినట్లు తెలిపారు. ఆయా గ్రామసభల్లో సర్పంచ్ కుక్కల నాగమణి, కార్యదర్శి రామకృష్ణ, మేట్లు, ఉపాధి కూలీలు, పలువురు రైతులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న జేఈ రవికుమార్



విద్యాశాఖ వనరుల కేంద్రం నిర్మించాలని యూటీఎఫ్ నాయకుల నిరసన

ప్రభుత్వ కార్యాలయాల చెంతనే వనరుల కేంద్రం నిర్మించాలి

ఆత్రేయపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలున్న చోటే మండల విద్యాశాఖ వనరుల కేంద్రం నిర్మించాలని పలువురు ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఆత్రేయపురం మండల కేంద్రంలో నూతన వనరుల కేంద్ర నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలున్న చోట ఖాళీగా ఉన్న స్థలాల్లో మండల విద్యావనరుల కేంద్రం నిర్మించాలని పలువురు ఉపాధ్యాయులు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో పరిపాలనాధికారి రామస్వరూప్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు ఆధ్వర్యంలో యూటీఎఫ్ మండల శాఖ నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

రావులపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా కోరానికి సరిపడ సభ్యులు రాకపోవడం, భారీ వర్షం నేపథ్యంలో సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. మళ్లీ నిర్వహించే తేదీని త్వరలో తెలియచేస్తామని ఆయన తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న కామన

రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దు

కామన ప్రభాకరరావు

మండపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పండిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన విజయవాడలో వున్న సివిల్ సప్లయి కార్యాలయం ఎండీ ఢిల్లీరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఆంక్షలు విధించవద్దని ఆయన కోరారు. సివిల్ సప్లయి ద్వారా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ప్రతినిధి వడ్డి నాగేశ్వరరావు తదితరులు వున్నారు.

నిత్యాన్న దానానికి విరాళం

మామిడికుదురు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఎస్.బాలాజీ-గంగారత్నం దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. విరాళమందించిన భక్తులకు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి చిత్రపటంతోపాటు ప్రసాదాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంతో రైతులకు ఎంతో మేలు



మండపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పెట్టుబడుల ఖర్చులు అన్నదాతలకు భారంగా మారుతున్నాయి. మరోపక్క వ్యవసాయపనులకు సంబంధించి కూలీల కొరత తీవ్రంగా ఉంది. ఈనేపథ్యంలో రైతులు పెట్టుబడుల వ్యయం తగ్గించటంతోపాటు ప్రభుత్వం సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చింది. అధునిక యంత్రాలు, డ్రోన్లు అందించటం ద్వారా రైతులకు ఖర్చులు తగ్గించుతున్నాయి. వ్యవసాయ యంత్రాలపై ప్రభుత్వం సబ్సిడీని రైతులకు అందజేస్తున్నది. వీటిని ఎలా వినియోగించాలి, వాటివల్ల కలిగే ప్రయోజనాలపై ఆలమూరు వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్‌కేవి చౌదరి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ యంత్రాలను రాయితీపై అందిసున్నాయని తెలిపారు. వాటిని పొందాలంటే ఐదుగురు రైతులు సంఘంగా ఏర్పడి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలా చేసుకుంటే 80శాతం రాయితీతోపాటు దాదాపు పదిలక్షలు విలువ చేసే డ్రోన్‌లను పొందవచ్చన్నారు. ఇందులో ప్రభుత్వ రాయితీ రూ 7.84 లక్షలు, కాగా రైతులు తమ వంతు వాటాగా రూ1.96 లక్షలు చెల్లించి డ్రోన్‌ను పొందవచ్చని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నూతనంగా మహిళా సంఘాలకు నమోడ్రోన్ దీదీ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా అందజేస్తున్నారని తెలిపారు. వాటిని నడిపేందుకు డిజీ సీఏ అనుమతులు కలిగిన శిక్షణ పొందిన పైలెట్ అవసరం అని తెలిపారు. పంటలో మందులు పిచికారీ చేస్తే ఎకరాకు సగటున రెండు వందల లీటర్ల నీరు అవసరం అవుతుందని తెలిపారు. డ్రోన్ సాయంతో కేవలం పదిలీటర్ల సరిపోతాయని తెలిపారు. కూలీల సమస్య నుంచి బయట పడవచ్చని ఆయన తెలిపారు. సమయం, శ్రమ ఆదా అవుతుందని ఆయన తెలిపారు. పంటల నాణ్యత, ఉత్పత్తి కూడా పెరుగుతుందని ఆయన తెలిపారు.

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన బి.కృష్ణారెడ్డి, వాణి దంపతులు రూ.1,01,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ ఈవో నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటం అందచేశారు. గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామి వారిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదంలో పాల్గొన్నారు.



అన్నదానానికి విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులు స్కౌట్‌పై అవగాహన పెంచుకోవాలి

రావులపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): స్కౌట్ అండ్ గైడ్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన దేశభక్తి పెరుగుతుందని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి, భారత్ స్కౌట్, గైడ్స్ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు అన్నారు. రావులపాలెం బాలుర జడ్పీ పాఠశాలలో నిర్వహించిన స్కౌట్ మాస్టర్స్ ట్రైనింగ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను సమాజ సేవకులుగా తీర్చిదిద్దడానికి ప్రారంభించబడిన బాలభట ఉద్యమాన్ని బలోపేతం చేయ్యాల్సిన బాధ్యత శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ నెల 29 వరకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.



మాట్లాడుతున్న స్కౌట్ అండ్ గైడ్ జిల్లా కార్యదర్శి



రావులపాలెం జడ్పీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో షేక్ సలీంబాషా

విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలి

రావులపాలెం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులను బోధన విధానాన్ని మార్చుకుని విద్యార్థులకు అర్థమయ్యేలా వారికి బోధన అందించాలని డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా అన్నారు. రావులపాలెం బాలికల జడ్పీ పాఠశాలలో సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి పి.రాంబాబు ఆధ్వర్యంలో టీచ్ టూల్స్ మాస్టర్ ట్రైనర్స్ రెండు రోజుల శిక్షణ గురువారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా డీఈవో పాల్గొన్నారు. టీచింగ్ సామర్థ్యాలు తదితర విషయాలను తెలుసుకున్నారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 451 మంది టీచ్ టూల్స్ అబ్జర్వర్స్‌కు త్వరలో మండలస్థాయిలో శిక్షణ పొందిన 44 మంది మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

అధ్వానంగా పుష్కరఘాట్లు

ఆత్రేయపురం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గౌతమి, వశిష్ట నదుల వెంబడి నిర్మించిన పుష్కరఘాట్లు బురదతో పూడుకుపోయి అధ్వానంగా మారాయి. ఆయా గ్రామాల్లోని గోదావరి నది చెంతన నిర్మించిన పుష్కరఘాట్లు బురద మట్టితో పూడుకుపోయి అస్తవ్యస్థంగా మారాయి. కార్తీకమాసం ప్రారంభం కావడంతో మహిళలు పుష్కర స్నానాలు చేసేందుకు గోదావరి వద్దకు చేరుకుంటారు. 2017లో 17 పుష్కరఘాట్లను పుణ్యస్నానాలు ఆచరించేందుకు అప్పటి పుష్కరాల్లో నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ పట్టించుకున్న దాఖలాలు కానరాలేదు. పంచాయతీలు పుష్కరఘాట్లను శుభ్రం చేయకపోవడంతో ప్రతి ఏడాది వస్తున్న వరదలకు మట్టితో పూడుకుపోయాయి. కార్తీక మాసం ప్రారంభం కావడంతో మహిళలు గోదావరి స్నానాలకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బురదమట్టిని తొలగించి పుష్కరఘాట్లను శుభ్రం చేయించాలని భక్తులు కోరుతున్నారు.



నార్కెడిమిల్లిలో బురదతో పూడుకుపోయిన పుష్కరఘాట్